

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

బుధవారం 10 ఏప్రిల్ 2024 | 10 పేజీలు


## వర్షాకాలం నుండి

# ఫసల్ బీమా..!!

- రాష్ట్ర ప్రభుత్వ విన్నపానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్..
- బీమా రైతులకు.. కొండంత అండ..
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు.

సూర్య కాల్వ శ్రీరాంపూర్

ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి, అనావృష్టి, పంటల తెగుళ్ల బారిన పడి నష్టపోయే అన్నదాతలకు పంటల బీమా యోజన పథకం అన్నదాతలకు కొండంత అండగా ఉంటుంది. రైతులను నష్టపరిహారం నుండి కాపాడడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో ఈ పథకం 2016-2020 వరకు అమల్లో ఉంది. అనంతరం గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకానికి ససేమిరా అంది.

2 లో...



## ఘనంగా ఉగాది పండుగ వేడుకలు

సూర్య కరీంనగర్ ప్రతినిధి, హుజురాబాద్

నూతన సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు మంగళవారం హుజురాబాద్ లో ప్రజలు భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. కొత్త ఏడాదిని పురస్కరించుకొని ప్రజలు తమ ఇండ్లను చక్కగా మామిడి తోరణాలతో అలంకరింపజేసుకొని ఇంటి ముందు ముగ్గులు వేశారు. కొత్త కుండ కొనుగోలు చేసి అందులో వంటకాలు చేయడం ఆనవాయితీ. ఉగాది పచ్చడి, భక్షాలు, గారెలు లాంటి పిండి వంటలు చేసుకుని దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొంత మంది పోచమ్మ దేవతకు బోనాలు అప్ప చెప్తారు. (వివరాలు లోపలి పేజీల్లో)



హుజురాబాద్ పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో...




కరీంనగర్ డిసిసి కార్యాలయంలో...



వేములవాడ రాజన్న ఆలయంలో...



మానకొండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ...

### నేతన్నల పోరాట ఫలితమే

## రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం

సూర్య కరీంనగర్ ప్రతినిధి

- ఎన్నికల కోడ్ ముగిసేలోపు నేతన్నల డిమాండ్లన్నీ పరిష్కరించాల్సిందే
- అవసరమైతే ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే దీక్షకు వెనుకాడబోం
- వర్కర్ టు ఓనర్ పథకాన్ని కొనసాగించాలి నేతన్న బీమా పథకం వయోపరిమితిని పెంచాలి
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్



2 లో...

## గురుకుల పాఠశాలలో

# విద్యార్థుల ఘర్షణ

- ఐదుగురు విద్యార్థులకు గాయాలు
- ఉపాధ్యాయుల తీరును నిరసిస్తూ రోడ్డెక్కిన తల్లిదండ్రులు
- ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోవాలని నినాదాలు.
- గురుకులం ముందు మూడు గంటలపాటు హైడ్రామా.
- పోలీసుల జోక్యంతో ఆందోళన విరమణ

సూర్య,రాయికల్

విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో ఐదుగురు విద్యార్థులు గాయపడగా,ఓ విద్యార్థికి తీవ్ర గాయాలైయ్యాయి,ఉగాది సెలవు రోజు కావడంతో తల్లిదండ్రులు పాఠశాలకు రావడంతో ఈ ఘర్షణ వ్యవహారం బయటపడింది.గాయాలపాలైన విద్యార్థుల పరిస్థితిని చూసి చలించిన బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు గురుకులం ముందు జగిత్యాల, రాయికల్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సంఘటన (మిగతా 2లో)





## అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ మేనిఫెస్టో

- సమాజాన్ని కుల మతాల పేరిట చీల్చడమే బిజెపి మేనిఫెస్టో
- నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి



సూర్య జగిత్యాల

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ఉంటే సమాజాన్ని కుల మతాల పేరిట చీల్చడమే బిజెపి మేనిఫెస్టో ఉందని నిజామాబాద్ ఎంపీ (మిగతా 2లో)

# వర్షాకాలం నుండి ఫసల్ బీమా..!!

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రివర్గం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని విన్నవించింది. దానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వచ్చే వర్షాకాలం నుండి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ పథకానికి రాష్ట్రంలో అధికారుల అంచనా ప్రకారం ప్రతిఏటా రూ 15 వందల కోట్లు అవసరం కానున్నాయి. తెలంగాణ లోను ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకము అమలులోకి రానుంది. వచ్చే వానకాలం సీజన్ నుంచి ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు తెలుపుతున్నాయి. వచ్చే సీజన్ నుంచి అమలు చేయాలంటే తక్షణమే పథకాన్ని అమలు చేసే బీమా కంపెనీలను టెండర్ల ద్వారా ఆహ్వానించడానికి నోటిఫికేషన్ విడుదల చేయాలి. అయితే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల కమిషన్ అనుమతి తప్పనిసరి ఫసల్ బీమా పథకం రైతులకు ప్రభావితం చేయనున్నందున ఈసీ అనుమతి లేనిదే ముందుకు సాగలేమని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఈసీ అనుమతి ఇవ్వకుంటే ఈ పథకం వచ్చే సీజన్ నుంచి అమలయ్యే అవకాశాలు తక్కువగానే ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.



**జిల్లాలో 2 లక్షల ఎకరాలకు బీమా.**

జిల్లా వ్యాప్తంగా సుమారు 2 లక్షల 13 ఎకరాలకు బీమా పథకం వర్తించనుంది. అందులో కాల్వ శ్రీరాంపూర్ మండలంలో సుమారు 28 ఎకరాలు బీమా పథకంలోకి రానుంది. ఇందులో అత్యధి కంగా వరి సుమారు 1,88,953 ఎకరాలు, మొక్కజొన్న 14,560 ఎకరాలు, ఉద్యాన పంటలు 9,703 ఎకరాలు, ఇతర పంటలు 235 ఎకరాల్లో రైతులు సాగు చేస్తుంటారు.

**ప్రీమియం ఇలా..**

పత్తి, మిర్చి సహా ఇతర వాణిజ్య, వాతావరణ ఆధారిత పంటలకు ఐదు శాతం రైతులు ప్రీమియం చెల్లించాలి. అదేవిధంగా వర్షాకాలం సీజన్లో సాగు చేసే ఆహార ధాన్యాల పంటలకు రెండు శాతం ప్రీమియం రైతులు చెల్లించాలి. గతంలో అక్కడి వాతావరణ పరిస్థితులను బట్టి ప్రీమియం రేటు మారుతుండేది. అయితే ఈసారి రైతు వాటా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందని ఇప్పటికే పలువురు మంత్రులు ప్రకటించారు. కాబట్టి రైతులంతా ఈ పథకంలోకి రానున్నారు మరోవైపు ఈ పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా అధికారులు కసరత్తు ప్రారంభించారు.

**క్లస్టర్ల వారిగా అమలు..**

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతులకు అనుకూలంగా లేదన్న భావనతో ఈ పథకాన్ని గత బిఆర్ఎస్ ప్రభుత్వం 2020 నుండి అమలు చేయలేదు. అయితే ఏదో ఒక పంటల బీమా పథకం ఉండటమే మేలన్న భావన రైతుల్లో ఉంది. దీంతో చివరకు కాంగ్రెస్ ప్రభుత్వం పాత పథకాన్ని అమలు చేయనుండ ప్రకృతి వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందుతుందని రైతులు కోరుతున్నారు. గతంలో అప్పటి ప్రభుత్వం ఆరు క్లస్టర్లు ఏర్పాటు చేసింది. ఆ ప్రకారమే ఈసారి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగే అవకాశాలున్నాయి. మొదటి క్లస్టర్ లో అదిలాబాద్, మంచిర్యాల, కొమురం భీం, జయశంకర్ భూపాలపల్లి ,సిద్దిపేట లు. రెండవ క్లస్టర్ లో కామారెడ్డి, రంగారెడ్డి, నిర్మల్, యాదాద్రి, నిజామాబాద్లు, మూడవ క్లస్టర్ లో కరీంనగర్, జగిత్యాల ,పెద్దపల్లి, జనగామ, సిరిసిల్ల లు, నాలుగవ క్లస్టర్ లో సూర్యపేట, సంగారెడ్డి, ఖమ్మం, మెదక్, నల్లగొండ లు,ఐదవ క్లస్టర్ లో వరంగల్, హనుమకొండ, వనపర్తి, భద్రాద్రి లు, ఆరవ క్లస్టర్ లో మహబూబాబాద్, జోగులాంబ గద్వాల, మేడ్చల్, వికారాబాద్, మహబూబ్ నగర్ జిల్లాలు ఉన్నాయి.

**బీమాపై రైతులకు అవగాహన కల్పించాలి.**

ప్రభుత్వం అమలు చేసే బీమా పథకంపై ముందుగా వ్యవసాయ అధికారులు ద్వారా రైతులకు అవగాహన కల్పించాలి. బీమా ప్రీమియం చెల్లించిన అనంతరం రైతులకు పరిహారం ఖరారు చేసే విషయాన్ని తెలపాలి. రైతుల ఫిర్యాదులు వినడానికి పరిష్కరించడానికి ఖచ్చితమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. రైతులకు బీమా పరిహారం అందించే విషయంలో వివిధ దశల్లో విధిస్తున్న షరతులు, నిబంధనలను మార్చాలి అవసరమైతే తొలగించాలి.

# అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ మేనిఫెస్టో

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థి జీవన్ రెడ్డి విమర్శించారు. జగిత్యాల పట్టణంలోని ఇందిరా భవన్ లో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి మంగళవారం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ పై ప్రభుత్వాన్ని ప్రభుత్వాన్ని హెచ్చరించినా పట్టించుకోలేదు. తుమ్మిడి హెట్టి వద్ద ప్రాజెక్ట్ నిర్మిస్తే ఒక్క ఎత్తిపోతల తో నీరు ఎల్లంపల్లి చేరేదని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. 4000 మెగా వాట్ల విద్యుత్ పొందే అవకాశం ఉండగా, ఆనాటి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. భగీరథ తో 40 వేల కోట్లు, యాదాద్రి తో 40 వేల కోట్లు, కాళేశ్వరం తో లక్ష కోట్లు భారం రాష్ట్రం పై పడిందన్నారు. మోడీ పాలనలో ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసేలా 72000 కోట్ల నుండి 60000 కోట్లకు తగ్గించారు. మోడీ కి మద్దతు ధర పట్ల చిత్తశుద్ధి లేదు అన్నారు. నిరుద్యోగ యువత కు ఏడాదికి 2 కోట్లు చొప్పున భర్తీ పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం చేసి, అమ్ముకానికి పెడుతున్నారని బిజెపి గెలిస్తే, రిజర్వేషన్లు కనుమరుగు అయ్యే ప్రమాదం పొంచి ఉంది అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో హిందూ వ్యతిరేకం అని కిషన్ రెడ్డి పేర్కొనడం హాస్యాస్పదం అన్నారు. కనీస మద్దతు ధరకు చట్ట బద్ధత కల్పించలనడం హిందూ వ్యతిరేకమా అని ప్రశ్నించారు. 75 శాతం బలహీన వర్గాలు హిందువులు, కూలీలకు ఉపాధి కల్పించడం హిందూ వ్యతిరేకమా అని ప్రశ్నించారు. రిజర్వేషన్ కోసం కుల గణన చేపట్టడం హిందూ వ్యతిరేకమా అన్నారు. సమాజాన్ని కుల, మతాల పేరిట చీల్చేవిధంగా మాట్లాడు తున్నారు. మా మేనిఫెస్టో కన్న మెరుగైన రీతిలో ప్రకటనలు చేయండి. చౌదరీ చరణ సింగ్ కు భారత రత్న, స్వామీ నాథన్ కు భారత రత్న ఇవ్వటమే కాదు వారి ఆలోచన విధానం అమలు చేయాలి అని హితవు పలికారు. మొన్నటి వరకు మోడీ 400 సీట్లు అన్నారు,ఇప్పుడు 350 సీట్లు గెలుస్తాం అంటున్నారు. వారానికి 50 చొప్పున సీట్లు తగ్గుతున్నాయని ఎద్దేవ చేశారు. రాష్ట్రంలో బీ ఆర్ ఎస్ లా ఎన్నికల్లో మోడీ చతికిల పడుతారని జోస్యం చెప్పారు. జగిత్యాల నియోజక వర్గ ప్రజలకు సేవలు అందించేందుకు నిజామాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం ఎంపీగా పోటీ చేస్తున్నా అన్నారు. ఎంపీగా గెలిచిన తర్వాత జగిత్యాలను కొడుకుగా అభి వృద్ధి చేస్తా అన్నారు.నిజామాబాద్ లో సైతం జగిత్యాల ప్రజల ఆదరణ లభిస్తుంద న్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ ఛైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, గిరి నాగభూషణం, తాటిపర్తి విజయలక్ష్మి దేవేం దర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఘర్షణ.

**సూర్య,రాయికల్**

(మొదటి పేజీ తరువాయి)

రాయికల్ మండలం అల్లీపూర్(సింగరావుపేట) గ్రామంలోని మహాత్మ జ్యోతిభాపూలే గురుకుల పాఠశాలలో మంగళవారం జరిగింది.సీనియర్ విద్యార్థులు తమను ఆకారణంగా కొట్టారని బాధిత విద్యార్థులు మీడియా ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు.ఇంతా జరిగిన పాఠశాలలోని ఉపాధ్యాయులకు ఈ విషయం తెలియకపోవడం గమనర్హం.ఉగాది రోజు పాఠశాలకు సెలవు కావడంతో ప్రిన్సిపల్ తో సహా 20మంది ఉపాధ్యాయులు విధుల్లో లేరు.వీరంతా ఒక్క మహిళ టీచర్కు బాధ్యతలు అప్పగించి వెళ్లారు. ఉదయం 9వ,7వ తరగతి విద్యార్థులు 6వ తరగతి విద్యార్థులను అకారణంగా కొట్టారు. సీనియర్ విద్యార్థులకు లీడర్ బాధ్యతలు అప్పగించి,జూనియర్ విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టాలని బాధ్యతలు అప్పగించడంతో రెచ్చిపోయిన సీనియర్లు,జూనియర్లను కొట్టారు. దాంతో ఐదుగురు విద్యార్థులు గాయపడ్డారు. గాయపడ్డ విద్యార్థులు ఎవరికైనా చెప్పితే ఇంకా కొట్టుతామని బెదిరించడంతో వారంతా భయంతో అలాగే ఉండిపోయారు.కాగా పండుగ నేపథ్యంలో తమ పిల్లలను చూసేందుకు వచ్చిన తల్లిదండ్రులు గాయపడ్డ పిల్లలను చూసి ఆందోళన చెందారు. ఫిర్యాదు చేద్దామని చూస్తే ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ అందుబాటులో లేకపోవడంతో ఉపాధ్యాయుల తీరును నిరసిస్తూ బాధిత విద్యార్థులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు.తమ పిల్లలను అకారణంగా కొట్టి గాయపరిచిన తోటి విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని, అందుబాటులో లేని ప్రిన్సిపల్,ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని దాదాపు రెండుగంటల పాటు రాస్తారోకో చేపట్టారు.వసతులు లేని ఈ గురుకులంలో వసతులు కల్పించాలని, నాణ్యమైన భోజనం అందించడంలేదని,కనీస వసతులు లేవని ఆవేదన చెందారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక టీచర్లు,స్టాఫ్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని నినాదాలు చేసారు.మరుగుదొడ్లు సరిపడా లేవని,ఉన్న మరుగుదొడ్లకు తలుపులు లేవని అసంతృప్తి వ్యక్తం చేసారు.తల్లిదండ్రుల రాస్తారోకోతో ట్రాఫిక్ స్థంబించింది.ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి.తల్లిదండ్రుల ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకొన్న ప్రిన్సిపల్ వెంకటరమణ గురుకులం వద్దకు జగిత్యాల నుండి గంటసేపటికి రాగ పిల్లల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్,ఇతర ఉపాధ్యాయులపై మండిపడ్డారు.మీ పిల్లలైతే ఇలాగే వ్యవహరిస్తారా? అని నిలదీసారు. రాయికల్ ఎస్ఐ అజయ్ తన సిబ్బందితో చేరుకొని తల్లిదండ్రులతో మాట్లాడి ట్రాఫిక్ క్లియర్ చేసారు.ఆనంతరం పాఠశాలలో బాధిత విద్యార్థులు,పేరెంట్స్ నుండి వివరాలు సేకరించారు.చాల మంది విద్యార్థులు సీనియర్ విద్యార్థులు పెట్టే ఇబ్బందులపై ఎస్ఐకు వివరించారు.ఉపాధ్యాయుల పర్యవేక్షణ లోపం వల్లనే ఇలా జరుగుతుందని మండిపడ్డారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వెంకటరమణ తల్లిదండ్రులతో మాట్లాడుతూ బుధవారం తల్లిదండ్రుల మీటింగ్ ఏర్పాటు చేస్తనని,ఘర్షణకు పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.పోలీసులు గొడవ పడ్డ విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇస్తామని ఇలాంటి సంఘటనలు మరోసారి జరుగకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## నేతన్నల పోరాట ఫలితమే

# రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం చాలా సంతోషం. వస్త్ర పరిశ్రమ ఆసాములు, నేతన్నలంతా ఐక్యంగా చేసిన పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. ఈ విషయంలో నేతన్నలకు అండగా నిలిచిన బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు అభినందనలు. గత 4 నెలలుగాటు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తూ... భిక్షాటన వంటి కార్యక్రమాల ద్వారా తమ దుస్థితిని రాష్ట్ర ప్రజల దృష్టికి తీసుకురావడంతోపాటు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి డిమాండ్లను నెరవేర్చుకున్న నేత కార్మికులకు, ఆసాములకు భారతీయ జనతా పార్టీ పక్షాన ప్రత్యేక అభినందనలనీ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు.ఇచ్చిన మాటకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ప్రభుత్వం బతుకమ్మ చీరల ఉత్పత్తికి సంబంధించి రావలసిన పాత బకాయిలు 270 కోట్ల రూపాయలను చెల్లించాలని కోరుతున్నాం. అట్లాగే వస్త్ర పరిశ్రమ యధావిధిగా కార్యకలాపాలు నిర్వహించేందుకు కొత్త ఆర్డర్లు ఇవ్వాలి. వీటితోపాటు విద్యుత్ బిల్లులపై 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని, 10 శాతం యార్న్ సబ్సిడీని వెంటనే అందించాలి. అట్లాగే నేత కార్మికుడిని ఆసామి చేయాల నే సంకల్పంతో గత ప్రభుత్వం రూ.370 కోట్ల వ్యయంతో ప్రవేశపెట్టిన 'వర్కర్ టు ఓనర్' పథకాన్ని కొనసాగించడంతోపాటు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభ నివారణకు, నేతన్నల అభ్యున్నతికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వంపై ఉందనీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నేతన్నలకు ఇచ్చిన హామీలన్నీ ఎన్నికల కోడ్ ముగిసే లోపే అమలు చేసి తీరాలి. అట్లాగాకుండా 6 గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన విధంగా ఎన్నికల్లో పబ్బం గడుపుకునేందుకు దొంగ హామీలిచ్చి నేతన్నలను మోసం చేయాలనుకుంటే మాత్రం చూస్తూ ఊరుకునేది లేదు. అదే జరిగితే ఎన్నికల కోడ్ ముగిసిన మరుక్షణమే సిరిసిల్లలో ఎంపీగా ప్రమాణం చేయకముందే దీక్ష చేసేందుకు సిద్ధంగా ఉన్నా. నేతన్నలకు అండగా పోరాటాన్ని ఉధృతం చేసి రాష్ట్ర ప్రభుత్వ మెడలు వంచేందుకు వెనుకాడేది లేదని ఈ సందర్భంగా హామీ ఇస్తున్ననీ అన్నారు.అట్లాగే చేనేత మిత్ర కింద ప్రతి మగ్గంపై పనిచేసే కార్మికుడికి నెలకు 2 వేల రూపాయల నూలు రాయితీ 2 నెలల మాత్రమే ఇచ్చి నిలిపివేశారు. వెంటనే రాయితీ కొనసాగిం చడంతోపాటు రాయితీ మొత్తాన్ని పెంచాలి. . ఈ విషయంలో నేతన్నల పక్షాన ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తా. దీంతోపాటు నేతన్న భీమా పథకంలో చేరాలంటే గరిష్ట వయో పరిమితి 75 ఏళ్లకు పెంచాలని కోరుతున్నా. తద్వారా అనుకోకుండా కార్మికులు మృతి చెందితే ఆ కుటుంబానికి 5 లక్షల ఆర్థిక సాయం అందుతుంది అని అన్నారు.అట్లాగే పవర్ లూమ్స్ పై నేతన్నలకు ప్రస్తుతం అందుతున్న ఉపాధి ఏమాత్రం సరిపోవడం లేదు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించాలి. ఏటా కనీసం 500 కోట్ల రూపాయల ఉత్పత్తులకు ఆర్డర్ ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరు తున్నా. దీంతోపాటు నేతన్న కుటుంబాల వాస్తవ ఆర్థిక స్థితిగతులపై సర్వే జరిపి జియో ట్యాగింగ్ చేసి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలనే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభు త్వం కాగితాలకే పరిమితం చేసింది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో సర్వే పూర్తి చేయించి నేతన్నలకు పూర్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అందేలా నా వంతు కృషి చేస్తానని అన్నారు.

# ఎంపీ బండి సంజయ్ నేతన్నల కోసం చేపడతానన్న దీక్ష కు దిగోచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

## - బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ సిరిసిల్లలో రేపు జరప తలపెట్టిన 'నేతన్నకు అండగా భరోసా దీక్ష' కు ప్రభుత్వం దిగివచ్చిందని, ఇది బండి సంజయ్ కుమార్ పోరాటే ఫలితమేనని , నేత కార్మికుల సమస్యలు, డిమాండ్లకు ప్రభుత్వం అంగీకారం తెలిపినందున, దీక్షా కార్యక్రమాన్ని ఎంపీ బండి సంజయ్ వాయిదా వేస్తున్నారని బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ నేతన్నల ప్రధాన డిమాండ్లైన బతుకమ్మ చీరెల బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించడంతోపాటు సంక్షోభంలో ఉన్న వస్త్ర పరిశ్రమను ఆదుకునేందుకు కొత్త ఆర్డర్లు ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఎంపీ బండి సంజయ్ దీక్షను వాయిదా వేశారని తెలిపారు. నేతన్నల ఇతర డిమాండ్లను సైతం అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉందన్నారు. నేతన్నలకు, ఆసాము లకు మద్దతుగా బండి సంజయ్ వివిధ రూపాల్లో చేసిన పోరాటాలతో



పాటు నేతన్నల ఐక్య పోరా టాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింద న్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించ కుండా పాలకులు నిర్లక్ష్యం చేస్తే పోరాటాల ద్వారానే వాటికి పరిష్కార మార్గాలు సాధ్యమనే విషయం నేతన్న పోరాటాలతో మరోమారు రుజు వైందన్నారు. ఈ విషయంలో వస్త్ర పరిశ్రమ అసాములకు, నేత కార్మికులను భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ పక్షాన ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నా మన్నారు. భవిష్యత్తుల ోనూ నేతన్నలకు బీజేపీ అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నేత కార్మికుల ప్రధాన డిమాండ్లను సమస్యలను ,హామీలను నెరవేర్చడంతోపాటు విద్యుత్ బిల్లులపై 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని, 10 శాతం యార్న్ సబ్సిడీని అందించాలన్నారు. అట్లాగే నేత కార్మికుడిని ఆసామి చేయాలనే సంకల్పంతో గత ప్రభుత్వం రూ.370 కోట్ల వ్యయంతో ప్రవేశపెట్టిన 'వర్కర్ టు ఓనర్' పథకాన్ని కొనసాగించాలని, అట్లాగే వస్త్ర పరిశ్రమ సంక్షోభ నివారణకు, నేతన్నల అభ్యున్నతికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని బీజేపీ పక్షాన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. నేత కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తే ఊరుకునేది లేదని, నేతన్నలకు అండగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంలో బండి సంజయ్ నేతన్నలకు నిరంతరం వెన్నుదన్నుగా ఉంటారని, అవసరమైతే మరోమారు దీక్ష చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

## ఘనంగా పోచమ్మ తల్లి దేవాలయంలో ఉగాది వేడుకలు

**సూర్య శంకరపట్నం**



కేశవపట్నం గ్రామంలో జరిగిన ఉగాది వేడుక లో పాల్గొన్న, ముదిరాజ్ మహాసభ మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె స్వరూప, ముదిరాజ్ మహాసభ మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె స్వరూప ఆధ్వర్యంలో కేశవపట్నం లో పోచమ్మ తల్లి ఆలయంలో ఉగాది వేడుకలను మహిళలు పిల్ల పాపలతో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామం లో మహిళలు బోనాలతో పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించి ఉగాది వేడుకలను నిర్వహించగా.పూజలు, పంచాంగ శ్రవణం అనంతరం ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత చంద్ర రాజేశ్వరరావు

**- సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



భారతదేశంలో విప్లవం పరిపూర్ణం గా వింజిలల్లాలని భూమికోసం భుక్తి కోసం పేదప్రజల విముక్తి కోసం. ప్రజల హక్కుల సాధనకై అమరు డైన. ప్రజల ఆశాజ్యోతి. భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 30 వ వర్ధంతి స్పందర్భంగా వారి చిత్రపటానికి కరీంనగర్ లోని బద్దం ఎల్లా రెడ్డి భవన్లో పూలమాలలు వేసి సిపిఐ శ్రేణులు నివాళు లర్పించారు.ఈ సందర్భంగా కసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ అగ్రనాయకులు , భూ పోరాట యోధులు దేశంలోని బడుగు, బలహీన వర్గాలకు లక్షలాది ఎకరాల భూములు సాధించడానికి అనేక భూ పోరాటాలు చేసి తనకున్న వందలాది ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టిన త్యాగధనుడు చంద్ర రాజేశ్వరరావు అనిపేర్కొన్నారు.ఈ వర్ధంతి కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, బోనగిరి మహేందర్, నాయకులు సందీప్ రెడ్డి, మారుతి, గణేష్, అభి,మనీ తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో పూజలు చేసిన మాజీ సర్పంచ్

**సూర్య బోయినపల్లి**



బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలోని శ్రీ దత్త సాయి ఆలయ ంలో మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పురస్కరిం చుకొని ఆలయంలో పూజలు నిర్వహించిన మాజీ సర్పంచ్ చిందం రమేష్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు వారు మాత్రం ఉగాది రోజునే కొత్త సంవత్సరం ఆరంభంగా పరిగణిస్తారని అన్నారు. సాయినాధుని ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో రైతన్నల పాడిపంటలు సమృద్ధిగా పండి సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. వేముల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉగాది వేడుకలు

**సూర్య - మానకొండూర్ :**



మానకొండూరు మండల వ్యాప్తం గా తెలుగు నూతన సంవత్సరమైన ఉగాది పర్వదిన వేడుకలు ఘనం గా జరిగాయి. ఉగాదిని పురస్కరిం చుకొని మానకొండూరు మండలం లోని ప్రజలు ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని అన్నారం గ్రామంలోని శ్రీ వర గట్టు ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో పురోహితులు సుప్రసన్న చార్యులు రాశి ఫలాలను చదివి వినిపించిన పంచాంగ శ్రవణంను భక్తులు శ్రద్ధగా విన్నారు. భక్తులకు ఉగాది పచ్చడను అందించి తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా పురోహితులు సుప్రసన్నాచార్యులు మాట్లాడుతూ కొత్త చిగుళ్ళు, కోయిల పాటలు, షడ్రుచులతో స్వాగతం చెప్పే తెలుగువారి నూతన సంవత్సరం ఈ ఏడాది శ్రీ క్రోధి నామ సంవత్సరంగా మన ముందుకు వచ్చిందన్నారు. రైతులు, కర్షకులు, ప్రజలు ఈ నూతన సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆంజనేయస్వామిని వేడుకున్నట్లు తెలిపారు.ఈ వేడుకల్లో ఆలయ ధర్మకర్త పోతర్ల ఆంజనేయులు ,మాజీ సర్పంచులు ఆరెల్లి సంపత్ గౌడ్, బొట్ల కిషన్, రాచర్ల రామస్వామి, వడుకపురం జగదీష్,వంగల ప్రదీప్,బొట్ల వంశీ,మార్క పవన్,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్.ఎస్.యు.ఐ వ్యవస్థాపక దినోత్సవం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



కరీంనగర్ జిల్లా ఎన్.ఎస్.యు.ఐ అధ్యక్షుడు మునిగంటి అనిల్ కుమార్ ఆధ్వ ర్యంలో ఘనంగా ఎన్.ఎస్.యు.ఐ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కేక్ ను జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పురిమల్ల శ్రీనివాస్ పలువురు నాయకులతో కలిసి కట్ చేసి ఎన్ఎస్యుఐ కార్యకర్తలకు తినిపించి శుభాకాంక్షలు తెలియజేసినారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ ఈ సమాజంలో ఎంతో ప్రాముఖ్యత ప్రాధాన్యత కలిగిన విద్యార్థి రాజకీయ రంగ ప్రవేశానికి ఎన్ ఎస్ యు ఐ వేదిక లాంటిదని ఈ వేదిక ద్వారా రాజకీయాలలో రాణించిన ఎంతోమంది నేతలు నేడు అత్యున్నతమైన స్థానాల్లో ఉన్నారని, ఈ జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ దీని ద్వారా రాజకీయ అరంగేట్రం చేసి రాష్ట్ర ఎన్.ఎస్.యు.ఐ అధ్యక్షునిగా ఎదిగి పార్టీకి అందించిన సేవలను గుర్తించిన అధిష్టానం పార్లమెంట్ సభ్యునిగా ఎంపీల ఫోరం కన్వీనర్ గా నియమించడంతో పాటు నేడు రాష్ట్ర మంత్రిగా అవకాశం కల్పించడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న వారు మంచి భవిష్యత్తు కలిగిన నేతలుగా గుర్తింపు పొందినారని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కర్ర సత్య ప్రసన్న రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్ నాయకులు మడుపు మోహన్, మునిగంటి అనిల్, ఆకారపు భాస్కర్ రెడ్డి, మల్లికార్జున రాజేందర్, బాల బద్రి శంకర్, పడిశెట్టి భూమయ్య, పెంచాల లక్ష్మణరావు, వీర దేవేందర్, బొమ్మ ఈశ్వర్ గౌడ్, గాలిపెల్లి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉగాది వేడుకలు

**సూర్య, వీణవంక**



వీణవంక మండల కేంద్రంతో పాటు మండలంలోని 26 గ్రామాల్లో మంగళ వారం ఉగాది వేడు కలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో శివాలయాల్లో, ఆలయాల్లో జరిగిన శ్రవణ పంచంగాల్లో వేద పండితులు వివిధ రాశులు కలిగిన వ్యక్తుల పేర్లతో ప్రస్తుత సంవత్సరం ఆదాయ, వ్యయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతి రెడ్డి, జెడ్పీటీసీ వనమాల సాధావ రెడ్డి, ఎంపీటీసీ లు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల ప్రచార రథాలను ప్రారంభించిన ఈవో

**సూర్య, ఇల్లందకుంట**



అపర భద్రాద్రి గా పేరుగాం చిన ఇల్లందకుంట శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థానం లో ఈనెల 15 నుండి 27 వరకు జరిగే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడపత్రిక ప్రచార రథాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి కందుల సుధాకర్ అర్చకులు సిబ్బందితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీపై విమర్శలు తగదు

**సూర్య, హుజురాబాద్**

ఎంతో చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీని ఎమ్మార్పీఎస్ నాయకులు విమర్శించడం తగదని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఇమ్మడి దయాకర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ బిజెపి పార్టీకి కొమ్ము కాస్తూ దళిత వ్యతిరేక పార్టీకి మద్దతు ఇవ్వడము చాలా బాధాకరమని అన్నారు. ఎస్సి లకు ఎన్నో కార్యక్రమాలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ కి ఉందన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి ఎస్సీ రిజర్వేషన్లు ఎత్తివేసే ప్రమాదం ఉంది కాబట్టి ఇవాళ బిజెపి ని చిత్తుగా ఓడించాలని అన్నారు.

## గల్లంతయిన విద్యార్థి మృతదేహం లభ్యం

**సూర్య, హుజురాబాద్ రూరల్**



హుజురాబాద్ మండలం కందుగుల లోని ఓ వ్యవసాయ బావిలో గల్లంతయిన మాదం విజయ్ కుమార్(21) అనే విద్యార్థి మృతదేహం మంగళవారం లభ్యమైనట్లు హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..... విజయ్ కుమార్ హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడని, ఉగాది పండుగ రావడంతో ఆదివారం రాత్రి ఇంటికి వచ్చినట్లు చెప్పారు. సోమవారం అదే గ్రామానికి చెందిన పలువురు యువకులతో కలిసి సమ్మిరెడ్డి అనే రైతుకు చెందిన వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లినట్లు వివరించారు. విజయ్ కుమార్ గత కొంతకాలంగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నట్లు చెప్పారు. ఈత కొడుతూ స్పృహ కోల్పోయి నీటిలో మునిగిపోయినట్లు వివరించారు. సమాచారం అందుకున్న గ్రామస్తులు బావి వద్దకు చేరుకుని చూశారు. గజ ఈతగాళ్లను బావిలోకి దింపిన ఫలితం లేదు. మంగళవారం బావిలో మోటార్లు పెట్టి నీటిని బయటకు తోడి మృతదేహాన్ని గుర్తించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుని తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

## ప్రతి ఇంట్లో సంతోషం నిండాలి

**- మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు.**

**సూర్య మెట్పల్లి**



నూతన సంవత్సరం లో ప్రతి ఒక్కరి ఇండ్లలో సుఖ సంతోషాలు అష్టైశ్వర్యాలు సిద్దించా లని భగవంతుని కోరుకున్నట్లు కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, భారత రాష్ట్ర సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. బుధవారం ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణంలోని అయ్యప్ప, హనుమాన్ ఆలయాల్లో విద్యాసాగర్ రావు సరోజమ్మ దంపతులు, మున్సిపల్ చైర్ పర్సన్ రణ వేణి సుజాత సత్యనారయణ తో కలసి ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. నూతన సంవత్సరం లో వర్షలు సమృద్దిగా కురిసి పంటలు పండాలని, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని భగవంతుణ్ణి వేడుకున్నట్లు ఆయన తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో క్రోధీ నామా ఉగాది వేడుకలు

**సూర్య మెట్‌పల్లి**

డివిజన్ తో పాటు పలు గ్రామాల ప్రజలు క్రోధీ నామా ఉగాది పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. పంచాంగ శ్రవణంలో కొత్త సంవత్సరంలో ఎవరి జాతకాలు ఎలా ఉండబోతున్నాయో పురోహితులు చెబుతుంటే విన్న అనంతరం ఉగాది పచ్చడిని ఇంటిల్లిపాది సేవించారు.

**లక్ష్మి నరసింహ ఆలయంలో....**



పట్టణంలోని బోయవాడ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పురోహితులు రమాకాంత్ చారి పంచాంగ పఠనం చేయగా భక్తులు తమ జాతకాలను పరిశీలించుకున్నారు. అనంతరం ఉగాది పచ్చడి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పర్మి నర్సయ్య, ఆర్మూర్ నరేందర్, ప్రోహర్ హెమచందర్, తోపారపు రాజేందర్, నాగయ్య, సురేష్, రాజారాం, పురుషోత్తం, గంగాధర్, రాజయ్య తదితరులు ఉన్నారు.



**మార్కండేయ ఆలయంలో...**

పట్టణంలోని మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు ద్యావనపెల్లి రాజారాం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పురోహితులు సంతోష్ పంచాంగ శ్రవణం పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో భీంగల్ మున్సిపల్ కమిషనర్ గంగుల సంతోష్ కుమార్, పద్మశాలి నాయకులు సాంబారి ప్రభాకర్, భీమనాతి సత్యనారయణ, భాస్కర్, పద్మశాలి సంఘ నాయకులు పాల్గొన్నారు.

**విశ్వ బ్రాహ్మణ మనుమయ సంఘం ఆధ్వర్యంలో...**

విశ్వ బ్రాహ్మణ మనుమయ సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ప్రజలకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ప్రారంభించారు. విశ్వ బ్రాహ్మణ మనుమయ సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఉగాది సందర్భంగా పచ్చడి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మనుమయ సంఘ అధ్యక్షులు పులిమామిడి చంద్రయ్య, హనుమాన్లు,శ్రీధర్ చారి, కొడిమ్యాల వెంకటస్వామి, మురళి, అంజయ్య, చుతాహరి రవీందర్, లక్ష్మణ్, గోవర్ధన్ చారి,వెంకన్న ,దేవయ్య, చిన్నయ్య, నవీన్, నాగభూషణం రాజేం దర్, దామోదర్,లక్ష్మీరాజం,రాజశేఖర రాజు, విఠల్, గంగాధర్, కుమార్.అశోక్,మరుతి, శ్రీనివాస్, రాజు, నరసయ్య ,రాములు ,శంకర్, గంగారాం, ఎమ్ ఏ.అప్సర్ పాల్గొన్నారు.



## వెంకటాపూర్‌లో వ్యక్తి మృతి

**సూర్య -కోరుట్ల**

మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన అబ్దుల్ రహీం (45) అనే వ్యక్తి సోమవారం రాత్రి వెంకటాపూర్ క్రాస్ రోడ్ లోని ఓ ఇంటికి వెళ్లి ఆ ఇంటి ముందరే మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు .అతని మరణము అనుమానస్పదంగా ఉన్నదని మృతుని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు .మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులుకేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్

**సూర్య - కథలాపూర్**



మండలంలోని పెగ్గెర్లలో శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి, తుర్తి లో శ్రీ హనుమాన్ విగ్రహ ప్రతిష్టపనలో ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్న ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడు తూ మండల ప్రజలకు శ్రీ క్రోధి నామ నూతన సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలుపుతూ అందరు ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యలతో విరజిల్లాలని దేవున్ని వేడుకున్నట్టు తెలిపారు. ఆనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ను శాలువలతో ఘనంగా సన్మానించారు.ఈ జాతర ఉత్సవాల్లో డిసిసి మాజీ సభ్యుడు చెదలు సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు అజీమ్,నాగరాజు, వెగ్యారపు శ్రీహరి,గోపిడి ధనంజయ రెడ్డి,పులి హారి ప్రసాద్,మార్గం శ్రీనివాస్,వాకిటి రాజారెడ్డి, వెలిచాల సత్యనారాయణ,జవ్వాజి రవి, కూన శ్రీనివాస్, బజాజ్ మహేష్ తదితరులు ఉన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

**సూర్య మెట్‌పల్లి**



ఇటీవల జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడుగా ఎన్నికైన పుప్పాల లింబాద్రీ ని మున్నూరు కాపు సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పుప్పాల లింబాద్రీ సంఘ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బొడ్ల శ్రీనివాస్, సంగు గంగాధర్, అనిల్ హనుమాన్లు, నాయకులు బోడ్ల రమేష్, మార్గం గంగాధర్,ఆకుల ప్రవీణ్, సుదన్ నరసయ్య, ఆనంద్, శ్రీనివాస్, రూపేష్ పాల్గొన్నారు

## నందీశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జువ్వాడి కృష్ణారావు

**సూర్య,కోరుట్ల టౌన్.**



కోరుట్ల పట్టణ నంది చౌక్ వద్ద గల నందీశ్వర దేవాలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా నందీశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కులు జువ్వాడి కృష్ణారావు భక్తుల సౌకర్యా ర్థం ఆలయ నిర్వహకులు ఉగాది పచ్చడిని ఏర్పాటు చేశారు. ఇట్టి ఉగాది పచ్చడి అర్చకులు జువ్వడి కృష్ణారావుకు తీర్థ ప్రసాదాల రూపకంగా అందజేశారు.ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణా రావు మాట్లా డుతూ చైత్ర శుద్ధ పాఠం రోజున సృష్టి మొదలైందని అందుకే ఆ రోజునే యుగాది లేదా ఉగాదిగా పిలుస్తార న్నారు. ఈ ఉగాది పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు చేకూరాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతుని వేడుకున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావుతో పాటు కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ,కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం నాయకులు ఎంబెరి సత్యనారాయణ, కట్కమ్ దివాకర్,అయిండ్ల గణేష్ తునికి సాయి అర్చకులు భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి పండగకు ఏర్పాట్లు

**సూర్య-కోరుట్ల**



కోరుట్ల పట్టణంలోని సాయిరామ నది తీరాన గల శ్రీ సీతారామాలయంలో రాబోయే శ్రీరామనవమి పండగ నిర్వహణ కొరకు సీతారామాలయంలో మంగళవారం 3వ వార్డు కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ మున్సిపల్ బ్లేడ్ ట్రాక్టర్ తో ఆలయ ప్రాంగణమంతా చదును చేసి, మరమ్మత్తులు నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీరామనవమి పండుగను అత్యంత వైభవంగా ఆలయ కమిటీ అధ్యక్షులు వనతడుపుల మురళి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, కావున భక్తులందరూ కూడా అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ అభివృద్ధికి తోడ్పడి, సీతారామచంద్రుల వారి ఆశీస్సులు పొంది సుఖ సంతోషంగా ఉండాలని ఆయన కోరారు.

## ఉగాది కవి సమ్మేళనం

**సూర్య -కోరుట్ల**



స్వేచ్ఛ సాహిత్య సామాజిక సేవా సంస్థ కోరుట్ల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి క్రోధినామ ఉగాది కవి సమ్మేళనం పట్టణంలోని సి ప్రభాకర్ గ్రంథాలయ ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం వల్ల రచయిత ,కవులలో నూతన ఉత్తేజం కలుగుతుందని, ఇలా కవులు కళాకారులను ప్రోత్సహించడం ఎంతో ఉత్సాహాన్ని అందిస్తాయని అన్నారు. అనంతరం కవులు రచించిన తమ తమ కవితలను భక్తులకు వినిపించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కవులు గాయకు లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాస భూమయ్య చిన్న విశ్వనాథం, పేట భాస్కర్, నేరెళ్ల రామకృష్ణ శాస్త్రి, కటకం కవిత, కటోజ్వల మనోహర చారి ,అంకం దామోదర్, ఓటారికారి శ్రీనివాస్, భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అధ్యక్షులు సాదుల వినయ్ ఆధ్వర్యంలో NSUI ఆవిర్భవ వేడుకలు.

**సూర్య కొడిమ్యాల**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో NSUI 54వ ఆవిర్భావ దినోత్స వ వేడుకలు జిల్లా అధ్యక్షులు సాదుల వినయ్ ఆధ్వర్యంలో ఘనంగ నిర్వహించారు. ఈ సందర్బంగా కేకు కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్బంగా వినయ్ మాట్లాడుతూ రాబోవు పార్లమెంట్ ఎన్నికలలో NSUI నాయకులు సమర్ధతతో పనిచేసి ఎంపి అభ్యర్థిని గెలిపించడంతో పాటు విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం జీవన్ రెడ్డి, తాళ్లపల్లి అంజాగౌడ్,మండల NSUI అధ్యక్షులు తాళ్లపల్లి విక్రమ్ గౌడ్, జిల్లా సెక్రటరీ జామల్పూరి నిఖిల్, NSUI నాయకులు సన్నీ, వినయ్, వంశీ, ప్రణయ్, సుజిత్, రాకేష్, గణేష్, క్యాదాసి చందు, హరీష్, లవకుష్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

## శాలివాహన సంఘం నూతన కార్యవర్గం నియామకం

**సూర్య మల్లాపూర్**



మండలంలోని రేగుంట గ్రామంలో మంగళవారం శాలివాహన సంఘం నూతన కమిటీ నియామకం జరిగింది. అధ్యక్షులు మూడంపెల్లి రమేష్, మూడం పెల్లి మహేష్, ఉపాధ్యక్షుడు మూడంపెల్లి రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. శాలివాహన సంఘ అభివృద్ధికి పాటుపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజం, శ్రీను, శేఖర్, గంగరెడ్డి, రాజు, శేఖర్, మహేష్,హరిష్, గంగరాజం, రాము, నరేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శివాపార్వతుల ఊరేగింపు

**సూర్య బీర్పూర్**



బీర్పూర్ మండలం తుంగూర్ గ్రామంలో మంగళవారం ఉగాద వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుట్టపై వెలసిన శ్రీ రాజ రాజేశ్వర స్వామిని గ్రామ విధులలో ఊరేగింపు సేవను నిర్వహించారు. ఈ సందర్బంగా ఆలయ చేర్మెన్ కొల్లూరి ప్రభాకర్, మాజీ సర్పంచ్ శ్రీమతి మాట్లాడుతూ గ్రామం లోని ప్రతి ఉగాది పండగను పురస్కరించుకొని స్వామి వారి సేవ కార్యక్రమం నిర్వహించడం జరుతుందని తెలిపారు ఈ కార్యక్రమం లో ఆలయ పురోహితులు రాజన్న. ప్రవీణ్. హనుమాన్ స్వాములు భక్తులు పాల్గొన్నారు.

# బిజెపి కార్యాలయంలో ఉగాది ఉత్సవం

**సూర్య-పెద్దపల్లి టౌన్**

ఉగాది పండుగను పురస్కరించుకొని పెద్దపల్లి బిజెపి పార్లమెంట్ కార్యాలయంలో ఉగాది ఉత్స వం నిర్వహించారు. బిజెపి నాయకులు మాట్లా డుతూ పెద్దపల్లి ప్రజలందరికీ శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలుపుతు ,ఉగాది షడ్రుచుల ద్వారా సుఖదుఖాలకు, శాంతి కి, సమృద్ధికి, బాధ్యతలకు, హక్కులకు సమాన మైన ప్రాధాన్యతనిస్తూ జీవితాన్ని ముందుకు సాగిం చాలన్నది సందేశం అన్నారు. శ్రీ క్రోధి నామ సంవత్సరం కూడా ప్రజలందరి జీవితాల్లోకి సుఖ శాంతులను, ఆయురారోగ్యాలను, సమృద్ధి తీసుకు రావాలని భగవంతుణ్ని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తు న్నానని అన్నారు. ప్రకృతిలో వచ్చే మార్పులకు అనుగుణంగా, వ్యవసాయం ఆధారంగా, సనాతన ధర్మంలో పండుగలన్నీ జరిగేలా మన పూర్వీకులు నిర్ణయించారు. మన భాషను, సంస్కృతిని,



సంప్రదా యాలను తర్వాతి తరాలకు అందిం చడం.. పండుగలను జరుపుకోవడంలోని అంతరా ర్థం, మన హక్కులను గుర్తుచేస్తూనే, ప్రకృతిపట్ల, సమాజం పట్ల మన బాధ్యతలను మన పండుగలు గుర్తుచేస్తాయని, నవ వసంతం సమయంలో జరుపుకునే ఉగాది పండుగ కూడా ఇందులో ఓ భాగం. అందుకే మన పూర్వీకులు సూచించిన ట్లుగా సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనంగా ఈసారి ఉగాది పండుగను జరుకుం టారని ఆకాంక్షిస్తున్నా మన్నారు. అలాగే వచ్చే నెలలో పార్లమెంటు ఎన్నికలు జరుగనున్న సందర్భంలో ప్రజలు ఈసారి పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటింగ్ శాతాన్ని పెంచి పెద్దపల్లి పార్లమెంటులో బిజెపి అభ్యర్థిని గెలిపించి మూడవసారి ప్రధాని అవుతున్న నరేంద్ర మోడీ టీం లో గోమస శ్రీనివాస్ ఉండేలా ఓటు ద్వారా తీర్పు ఇవ్వాలని పెద్దపల్లి పార్లమెంట్ ప్రజలను కోరుతున్నామని, మరోసారి ప్రజలం దరికీ శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్ ,పొల్సని సంపత్ రావు ,రాజం మహాంతా కృష్ణ ఈర్లా శంకర్ వేల్పుల రమేష్ ఉప్పు కిరణ్ ఎర్రోళ్ల శ్రీకాంత్ గుడ్ల సతీష్, పిట్ట వినయ్ నక్క శ్రీనివాస్ గదసి సతీష్ బొడ్డుపల్లి కుమార్ కార్తీక్ అవుల శ్రీనివాస్ యాదవ్,సతీష్ పల్వురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు ఉగాది పురస్కార్

**సూర్య-పెద్దపల్లి రూరల్**



పెద్దపల్లి మండలం రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్స్ బట్టు విజయ్ కుమార్ ఉగాది పురస్కారం అందుకున్నారు. సమైఖ్య సాహితీ, లయన్స్ క్లబ్ 320జి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనంలో ఉగాది పురస్కారాలు అందించారు. విధుల్లో ఉత్తమ సేవలందించినదుకు గాను విజయ్ కుమార్ ను పురస్కారానికి ఎంపిక చేశారు. అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ చేతుల మీదుగా విజయ్ కుమార్ ఉగాది పురస్కారాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా పీహెచ్ సి ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

## ఘనంగా ఉగాది వేడుకలు

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



కాల్వ శ్రీరాంపూర్ మండలంలో శ్రీ క్రోధి నామ సంవత్సర తెలుగు తొలి పండుగ ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఆలయాలు ముస్తాబు చేశారు. ప్రజలందరు ఉదయమే లేచి తలంటు స్నానాలు చేసి గుమ్మానికి తోరణాలు కట్టి అలంకరించి ఇంటి ముందు ముగ్గులు వేసి వసంత లక్ష్మి స్వాగతించారు. షడ్రుచుల పచ్చడిని స్వీకరించి ఈ ఏడాదంతా అంతా మంచే జరగాలని వేడుకున్నారు. వాహనాలకు ఆలయాల వద్ద పూజలు చేశారు. వేద బ్రాహ్మణులు ఆలయాల్లో పంచాంగ శ్రవణంతో రాశి ఫలాలను, పంట సాగు విషయాలు తెలిపారు. ఏడాది పాటు చేయాల్సిన కార్యక్రమాలను అనువైన వాటిని రాశి ఫలాల వారిగా వివరించారు.

## సామాజిక సేవ అభినందనీయం.

**- అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్.**

**- రెసిడెంట్ టీచర్స్ చలివేంద్రం ప్రారంభం.**

**సూర్య-పెద్దపల్లి టౌన్**



సామాజిక సేవలో పాలుపం చుకోవడం అభినం దనీయ మని అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ అన్నారు. పెద్దపల్లి రెసిడెంట్స్ టీచర్స్ ఆధ్వర్యంలో పెద్దపల్లి అయ్య ప్ప టెంపుల్ వద్ద మానస గంగోత్రి వాటర్ ప్లాంట్ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ ప్రారంభించారు. అలాగే ఉగాది పర్వదినం సందర్భంగా ఉగాది పచ్చడి, భక్ష్యాలు అదనపు కలెక్టర్ చేతుల మీదుగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ పెద్దపల్లిలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయులందరూ వారి వారి సంఘాలకు అతీతంగా ఐక్యంగా పెద్దపల్లి రెసిడెంట్ టీచర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు సామజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందిం చదగ్గ విషయమన్నారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. పెద్దపల్లి రెసిడెంట్ టీచర్స్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గాన్ని, అసోసియేషన్ సభ్యులను అదనపు కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు సాదుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వేగోళం సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు వి. హనుమంతు, పెద్దపల్లి మండల విద్యాధికారి సురేందర్ కుమార్, కార్యవర్గ సభ్యులు మహేందర్ రెడ్డి, కర్రే ప్రవీణ్, కనకయ్య, కిషన్ రెడ్డి, సంపత్ రెడ్డి, మెతుకు తిరుపతి, కర్నె రాజు, ఫణిందర్, సలహాదారులు చాట్ల ఆగయ్య, సీనియర్ సభ్యులు రాంరెడ్డి, జీవన్ రాజు, అల్లేంకి సత్యనారాయణ, జితేందర్ రెడ్డి, తాళ్ల నరేందర్, ఆరెపల్లి కుమారస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

## అఖిల భారత యాదవ మహాసభ యువత జిల్లా అధ్యక్షునిగా సాగర్.

**సూర్య-పెద్దపల్లి రూరల్**



అఖిల భారత యాదవ మహాసభ యువత విభాగం పెద్దపల్లి జిల్లా అధ్యక్షునిగా పెద్దపల్లి మండలం పాలితం గ్రామానికి చెందిన అట్ల సాగర్ యాదవ్ ను నియమించినట్లు యువత రాష్ట్ర అధ్యక్షులు రమేష్ యాదవ్ తెలిపారు. ఈమేరకు నియామక పత్రం విడుదల చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం ఓదెల జడ్పీటిసి గంట రాములు యాదవ్ సాగర్ కు నియామక పత్రం అందజేశారు. ఈసందర్భంగా సాగర్ ను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి సాగర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సందనవేణ సునీత రాజేందర్, మేకల మల్లేశం, మారం తిరుపతి యాదవ్, పెగడ రమేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**సూర్య- పెద్దపల్లి టౌన్**



పట్టణ కేంద్రంలోని శాంతి నగర్ శ్రీ.సీతరాముల స్వామి దేవాలయంలో, సాయి బాబా దేవాలయంలో తెలుగు సంవత్సరాది క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితులు, పంచాంగకర్తలు ఎమ్మెల్యే విజయరమణ రావు కు రాశి ఫలంతోపాటు ఇతర రాశుల పంచాంగన్ని వివరించారు అనంతరం అందరికీ ఉగాది పచ్చడి వితరణ చేసి తెలంగాణ రాష్ట్ర మరియు పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ తెలుగు సంవత్సరాది క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పట్టణ కౌన్సిలర్స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి వైద్య ఖర్చులకు లైన్స్ క్లబ్ ఆర్థిక సహాయం

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం కలవ చర్ల గ్రామంలో ఇటీవల కుక్కలు చేసిన దాడుల్లో సెంటినరీ కాలనీలోని బేకరీ లో పనిచేస్తున్న కృష్ణ నగర్ లో నివాసం ఉంటున్న లక్ష్మణ్ కుమారుడు మహావీర్(2) చౌహాన్ తీవ్రంగా గాయప౯డడం జరిగింది. తలకి, కంటికి బలమైన గాట్లు పడడం వల్ల ఇప్పటికే చికిత్స చేయుటకు రూ.3 లక్షల వరకు ఖర్చయింది. వారి యొక్క ఆర్థిక పరిస్థితి మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి, లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మోలుమూరు శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా వారి ఆర్థిక మరియు అత్యవసర చికిత్స పరిస్థితి వివరించారు. లైన్స్ క్లబ్ సభ్యులందరి సహకారంతో గంట వెంకటరమణారెడ్డి రూ.2000,రమ్య శ్రీధర్ రెడ్డి రూ.2000, పున్నం మధుకర్ రెడ్డి రూ.1000, బనుక (మేకల)అంజయ్య రూ.1000, సురేష్ బాబు రూ.1000, సత్తిరెడ్డి రూ.1000, డాక్టర్ శరణ్య మారుతి రూ.500, తీగల శ్రీధర్ రూ.500, తుమ్మల అశోక్ రూ.500 లతో మొత్తం 9500 రూపాయల నగదు మరియు బెల్లం జ్యోతి శ్రీనివాస్ 3000 రూపాయల నిత్యావసర సరుకులు అందజేయడం జరిగింది. అనంతరం లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ లైన్స్ క్లబ్ ఎప్పుడు పేదలకు సహాయం చేయడంలో ముందుంటుందని , అత్యవసర పరిస్థితుల్లో స్పందిస్తున్న లైన్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఇంకా భవిష్యత్తులో ఇంకా ఎవరైనా సహాయం చేయాలనుకునే వారు లైన్స్ క్లబ్ ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ కోశాధికారి కోంక పోచం, ఆర్గనైజర్ సురేష్ బాబు, కళాధర్ రెడ్డి, మేకల మారుతి, తీగల శ్రీధర్, పున్నం మధుకర్ రెడ్డి, వుయ్యాల కుమారస్వామి,సిద్ధం మురళి, గోవింద్, ఉత్తమ్ సింగ్ పాల్గొన్నారు.

## రామగిరి జడ్పీటిసి కి ఉగాది పురస్కార అవార్డు అందజేత



**సూర్య, సెంటినరీ కాలనీ**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో అఖిల భారత యాదవ మహాసభ మరియు యాదవ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారాల కార్యక్రమంలో వివిధ రంగాలలో సేవ చేస్తున్న వారిని గుర్తించి ఉగాది పురస్కార అవార్డులను అందజేశారు. దీనిలో భాగంగా రాజకీయ సేవా రంగం నుండి రామగిరి జడ్పిటిసి మ్యాదరవేణి శారద కుమార్ యాదవ్ కి ఉగాది పురస్కార అవార్డు ఇచ్చి సన్మానించారు. గతంలో సర్పంచ్ గా, ప్రస్తుతం జెడ్పిటిసిగా రాజకీయాలలో ప్రజలకు చేస్తున్న సేవను గుర్తించి ఈ అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు.

## ఆర్జీ-3 జిఎం కార్యాలయంలో ఉగాది వేడుకలు

**సూర్య, సెంటినరీ కాలనీ**



శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం పురస్కరించు కొని ఆర్జీ-3 జీఎం కార్యాలయ ఆవరణలో మంగళవారం పండ గ వేడుకలు నిర్వహించారు. ఆర్జీ-3 ఏపిఏ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. మాట్లాడుతూ పాత సంవత్సర తీపి, చేదు జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ నూతన సంవత్సరం లోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఉద్యోగులందరికీ శుభాకాం క్షలు తెలియజేశా రు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి కుటుం బంలో సుఖ సంతోషాలు ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరారు. సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఏరియా ఇంజనీర్ పాలపర్తి ఎలీషా, ఎస్వోటు జీఎంలు గుంజపడుగు రఘుపతి, సత్య నారాయణ, ఫైనాన్స్ ఏ.జీ.ఎం. శ్రీనివాసులు, ఏరియా భద్రత అధికారి వెంకట రమణ, అధికారులు చంద్ర శేఖర్, రవీందర్ రెడ్డి, రాజారెడ్డి, ఐలయ్య, సుధాకర్, చంద్ర శేఖర్ లతో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కలిసికట్టుగా పని చేయాలి

**- బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి నాయకుల చేరిక - నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి,ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**

**సూర్య, రాయికల్**

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని మాజీ మంత్రి,నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి ఎమ్మెల్సీ టీ.జీవన్ రెడ్డి అన్నారు. రాయికల్ పట్టణంతోపాటు కైరిగూడెం తాట్లవాయి గ్రామాల కు చెందిన పలువురు నాయకులు టిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ లో చేరగా,వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆహ్వానించారు. రాయికల్ పట్టణానికి చెందిన పల్లికొండ గంగాధర్ బిఆర్ఎస్ పట్టణ సెక్రటరీ, రాయికల్ పట్టణ 12వ వార్డు బిజెపి ఇన్చార్జి కట్ల నర్సయ్య,రాయికల్ గుడేటి సంఘం అధ్యక్షులు కాకర రాజేందర్ రెడ్డి,ఇటిక్యాల రోడ్డు సంఘ



సభ్యులు కల్లేడ శంకర్,రమేష్,నరేష్,గంగాధర్, నర్సయ్య, రఘుపతి,మహేష్, గంగాధర్,సాయభు 30 మంది సభ్యులు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. అలాగే కైరిగుడం తాజా మాజీ సర్పంచ్ గుడిపల్లి మల్లేశం,తాట్లవాయి గ్రామానికి చెందిన బద్ది కిరణ్, మరికొంతమంది యువజన సంఘాల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు అందరూ కలిసికట్టుగా పనిచేసే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించి రానున్న లోక్ సభ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాయికల్ పట్టణ అధ్యక్షులు మేకల రమేష్,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడి మహిపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి, పార్టీ అధ్యక్షుడు రవీందర్రావు,పట్టణ నాయకులు దివాకర్ రెడ్డి,రాకేష్ నాయక్,కట్కం రాజేశం,వాసం దిలీప్,తాట్ల వాయి మాజీ సర్పంచ్ కొసరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది పచ్చడి పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**- అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు**

**- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్**

**సూర్య-గోదావరిఖని:**



పట్టణంలోని ప్రధాన చౌరస్తా లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ధీటి బాలరాజు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కా న్ సింగ్ రాజ్ ఠాకూర్ పాల్గొని పలువురికి పచ్చడి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో కష్ట సుఖాలు, లాభనష్టాలతో పాటు సుఖసంతోషాలు కూడా ఉంటాయని తెలియజేసేదే షడ్రుచుల ఉగాది పచ్చడి అని వివరించారు. ఆరు రుచుల కలయికతో తయారు చేయబడిన ఉగాది పచ్చడి జీవితం అందించే అనేక అనుభవాలను సూచిస్తుందని బెల్లం, చింతపండు, వేప పువ్వులు, మామిడి, ఉప్పు, మిరపకాయల మిశ్రమం రుచుల యొక్క శ్రావ్యమైన సమ్మేళనాన్ని సృష్టించి జీవితంలోని అన్ని అంశాలను సమానత్వంతో స్వీకరించమని గుర్తు చేస్తుందని తెలిపారు. క్రోధినామ తెలుగు సంవత్సరంలో రామగుండం నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు రాజ్ ఠాకూర్ తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎక్కడ కూడా రాజీ పడే ప్రసక్తే లేదని, ప్రజలకు పూర్తిస్థాయిలో సుపరిపాలన అందించడమే తన ముందున్న ఏకైక లక్ష్యమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులతో పాటు పలువురు కార్పోరేటర్లు పాల్గొన్నారు.

## శ్రీ మహాశక్తి దేవాలయంలో కన్నుల పండుగగా ఉగాది వేడుకలు

**- పంచాంగ శ్రవణం, ప్రత్యేక పూజ**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



దక్షిణ భారతదేశంలో ప్రప్రథమంగా శ్రీ మహాదుర్గా, శ్రీ మహాలక్ష్మీ, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లతో కరీంనగర్ లో కొలువుదీరిన మహిమాన్విత దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయంలో మంగళవారం రోజున శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. శ్రీ శ్రీ శ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ దివ్య ఆశీస్సులతో, వేద పండితుల మంగళ శాసనాలతో దేవాలయంలో ప్రత్యేక పూజ, అభిషేక కార్యక్రమాలను చేపట్టారు. ఉదయం ఐదు గంటలకు అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు జరిపిన అనంతరం భక్తులందరికీ ఉగాది పచ్చడి ప్రసాద వితరణ చేశారు. తెలుగు నూతన సంవత్సరం, ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీ మహాశక్తి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అలాగే సాయంత్రం వేళలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయంలో జరిగిన ఉగాది పర్వదిన వేడుకల్లో, ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమాలు, పంచాంగ శ్రవణ కార్యక్రమాల్లో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

## జీవన తాత్వికతను బోధించేదే పంచాంగ శ్రవణం

**- వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



విభిన్న రుచుల సమ్మేళనంతో కష్టసుఖాల పట్ల సమభావనను ఆలవరుస్తూ జీవన తాత్వికతను బోధించేదే ఉగాధి పంచాంగ శ్రవణం అని నగునూర్ శ్రీదుర్గాభవానీ ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ అన్నారు. కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో బుధవారం చైత్ర మాస వసంతోత్సవాలు వైభవంగా ప్రారంభమైనాయి. ఈ ఉత్సావాలలో భాగంగా ఉగాధి పండుగాను పురస్కారించుకుని ఆయన పంచాంగ శ్రవణం చేస్తు గ్రహరాశుల విశేష సూచనలను వివరిస్తూ మనిషి మనుగడకు సరైన మార్గాన్ని పంచాంగం తేటపరుస్తుండన్నారు. కాలం భగవంతుడి స్వరూపం అని దాని నడకను వివరించడమే పంచాంగ పఠనం లక్ష్యం అన్నారు. పంచాంగమంటే వివిధ రాశుల ఆదాయ వ్యయాలు, రాజపూజ్య అవమానాల పట్టికే కాదని పంచాంగం రాశి ఫలాలకు అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించుకుంటూ గెలుపుదారిలో సాగిపోవాలన్నది పంచాంగ శ్రవణంలోని అంతస్సూత్రం అన్నారు. ఆలయ వసంతోత్సవాలలో భాగంగా పుణ్యవచనం, కలశ స్థాపన, అమ్మవారికి విశేష అలంకరణ, విశేష హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఫౌండర్ చైర్మేన్ వంగల లక్ష్మన్, భక్తులు పాల్గోన్నారు.

## డిజిపి రాజీవ్ రతన్ మృతి పట్ల సంతాపం

**సూర్య, హుజురాబాద్**

విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ డిజీపీ రాజీవ్ రతన్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందడం పట్ల జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి సంతాపం వ్యక్తం చేశారు. ఐపీఎస్ గా తన విధులను సక్రమంగా నిర్వర్తించేవాడని అన్నారు.

## ఇందిరా భవన్ లో పంచాంగ శ్రవణం

**సూర్య జగిత్యాల**



జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో ఉగాది పర్వదినాన్ని పుర స్క రించుకుని మంగళవారం పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రజలందరికీ క్రోది నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పచ్చడి తయారు చేసి, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి, జిల్లా డీసీసీ అధ్యక్షుడు, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల మున్సిపల్ ఛైర్పర్సన్, కాంగ్రెస్ నాయకులు, కుటుంబ సభ్యులతో కలిసి ఉగాది పూజ చేశారు. ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని, రాబోయే సంవత్సరంలో విస్తారంగా వర్షాలు కురిసి, ప్రాజెక్టులు నీటితో కళకళలాడాలని, పంటలు పండాలని, రైతులు క్షేమంగా ఉండాలని, శుభం జరుగాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల మున్సిపల్ ఛైర్పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్, గిరి నాగభూషణం, తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా ఉగాది వేడుకలు

**- పాల్గొన్న చొప్పదండి ఎమ్మెల్యే సత్యం**

**సూర్య మల్యాల**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మంగ ళవారం శ్రీ క్రోధి నూతన సంవ త్సర ఉగాది వేడుకలు సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయ ప్రాంగణంలో పంచాంగం శ్రావణం నిర్వహించారు ఈ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు ఆయన వెంట చొప్పదండి నియోజకవర్గం అధ్యక్షులు ముత్యం శంకర్ గౌడ్ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నేరెళ్ల సతీష్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు నక్క అనిల్ తదితరులు పాల్గొన్నారు

## ఈనెల 12న ఉచిత నేత్ర వైద్య శిబిరం

**సూర్య -కోరుట్ల**

పట్టణంలో ని పద్మశాలి కళ్యాణ భవనంలో ఈనెల 12 శుక్రవారం రోజున లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల, లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల కోటి నవదుర్గ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వనపర్తి చంద్ర మోహన్ తెలిపారు. ఈ వైద్య శిబిరం ఉదయం 9 గంటల నుండి ఒంటి గంట వరకు ఉంటుందని పట్టణముతో పాటు పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఘనంగా ఎన్ ఎస్ యు ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సూర్య జగిత్యాల**



జగిత్యాల పట్టణంలోని ఇందిరా భవన్ లో మంగళవారం ఎన్ ఎస్ యుఐ ఆవిర్భావ దినోత్సవ వేడుక లను నిజామాబాదు పార్లమెం ట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జగిత్యాల పట్టణ అధ్యక్షుడు చెట్టే భార్గవ్ చేతులమీదుగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడమే లక్ష్యంగా రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ని కేంద్రంలో అధికారం తీసుకువచ్చే దిశగా పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మెన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, టీపీసీసీ ప్రచార కమిటీ మెంబర్ రఘువీర్ గౌడ్, గొల్లపెల్లి మండల అధ్యక్షులు నిశాంత్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ గంగం మహేష్, యూత్ నాయకులు రాగుల ప్రదీప్, డబ్బు నిఖిల్, జుంబర్తి కిషోర్, మహిపాల్, ముల్లె శీను తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతోత్సవ కరపత్రాల ఆవిష్కరణ

**సూర్య, హుజురాబాద్**

ఈనెల 14వ తేదీ ఆదివారం రోజున జరిగే బిఆర్ అంబేద్కర్ 133వ జయంతోత్సవ కార్యక్రమ కరపత్రాలను మంగళవారం హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జయంతోత్సవ కమిటీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జయంతోత్సవ కార్యక్రమానికి ప్రజాస్వామ్యవాదులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జయంతోత్సవ కమిటీ చైర్మన్ ఖాలీద్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి ఇల్లందుల సమ్మయ్య, పూలే జయంతి కమిటీ చైర్మన్ ఉప్పు శ్రీనివాస్, చందుపట్ల జనార్ధన్, సొల్లు బాబు, వేల్పుల రత్నం, ఎర్ర రాజ్ కుమార్, జమదగ్ని, విష్ణుదాస్ గోపాలరావు, తులసి లక్ష్మణమూర్తి, డాక్టర్ తడికమళ్ళ శేఖర్, మంద బిక్షపతి, మోరే సతీష్, మాడుగుల ఓదెలు, తిప్పారపు భవనచంద్ర, తునికి వసంత్, మహిళా నాయకురాలు కరిమా, దాట్ల ప్రభాకర్, కోడూరి సమ్మయ్య, ఎర్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ -విప్ ఆది శ్రీనివాస్

**సూర్య వేములవాడ టౌన్**



శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళ వారం వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి రైతు మిత్రమండలి వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉగాది వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. వేములవాడ నియోజకవర్గ ప్రజలకు శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.తెలుగు నూతన సంవత్సరాన్ని ఆనందోత్సాహాలతో, సుఖసంతోషాల మధ్య ప్రజలు జరుపుకోవాలన్నారు. క్రోధి నామ సంవత్సరం మరింత శోభాయమానంగా విరాజిల్లాలని ఆకాంక్షించారు. ఈ సంవత్సరం అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించాలని, వర్షాలు సమృద్ధిగా కురువాలని, రైతులు పాడి పంటలతో ఆనందంగా వర్ధిల్లాలన్నారు.

# సిరిసిల్ల నేతన్నల పోరాటాన్ని విజయాన్ని బండి సంజయ్ ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటు

**- పోరాటాన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థ రాజకీయానికి వాడుకోవద్దని వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ హెచ్చరిక**

**సూర్య రాజన్న సిరిసిల్ల.**

నేత కార్మికులు పవర్లూమ్ అనుబంధ సంఘాల జేఏసీ పోరాట ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి నేతన్నల సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని జేఏసీ కన్వీనర్లు మూషం రమేష్, పంతం రవిలు తెలిపారు. కార్మికుల పోరాట విజయాన్ని తన విజయం గా చెప్పుకోవడం ఎంపీ బండి సంజయ్ కి సిగ్గుచేటని ఈ సందర్భంగా వారు ఆరోపించారు. మంగళవారం వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ సమావేశంలో జేఏసీ కన్వీనర్లు మూశం రమేష్ ,పంతం రవి మాట్లాడుతూ గత 45 రోజులగా వస్త్రపరిశ్రమలో నెలకొన్న సంక్షోభం నివారణకు, వస్త్ర పరిశ్రమ మీద ఆధారపడిన వాళ్లందరికీ ఉపాధి కల్పించా లని పోరాటాలు నిర్వహించింది వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ నేత కార్మికులేన న్నారు. జేఏసీ చేపట్టిన పోరాటాల ఫలితంగా ప్రభుత్వం స్పందించి వస్త్ర పరిశ్రమంలో సమస్య లను పరిష్కరిస్తామని, కార్మికులకు, ఆసాములకు 365 రోజులు చేతినిండా పని కల్పిస్తామని హామీ ఇచ్చిందని వెల్లడించారు. బతుకమ్మ చీరల



బకాయిలతో పాటు కార్మికులకు రావాల్సిన యారన్ సబ్సిడీ , కరెంట్ సబ్సిడీ తోపాటు ప్రస్తుతం అమలవుతున్న అన్ని పథకాలను అమలు చేస్తామని జేఏసీ సభ్యులతో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డిలు అందరి సమక్షంలో హామీ ఇవ్వడం జరిగింద న్నారు. నేతన్నలు చేసిన పోరాటాన్ని కొంతమంది తమ స్వార్థ రాజకీయాల కోసం పక్కదోవ పట్టిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నేను దీక్ష చేస్తున్నానని ప్రకటించిడం వలనే ప్రభుత్వం స్పందించిందని ప్రకటించడం ద్వారా, కార్మికులు పోరాడి సాధించిన విజయాన్ని తన విజయం గా చెప్పుకోవడం సిగ్గుచేటని, ఇది నేతన్నల పోరాటాన్ని అవమాన పరిచడమేనని వారు ధ్వజమెత్తారు. నేతన్నలకు ఉన్న జాతీయ చేనేత బోర్డు ,జాతీయ టెక్స్టైల్ బోర్డు, మహాత్మా గాంధీ బునకర్ బీమా యోజన, ఐసిఐసిఐ లాంబార్డ్ ఆరోగ్య భీమా, హౌస్ కం వర్క్ షీట్ లాంటి పథకాలను రద్దుచేసి, వస్త్ర పరిశ్రమపై 12 శాతం జీఎస్టీని బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విధిస్తే ఈ ఐదేళ్ల కాలంలో ఎన్నడు కూడా వస్త్ర పరిశ్రమతో పాటు కార్మికుల సమస్యలపై బండి సంజయ్ మాట్లాడలేదని ఆరోపించారు. గత రెండు నెలలుగా నేతన్నలు చేస్తున్న పోరాటంలో ఎక్కడా కనిపించని బండి సంజయ్ రానున్న ఎన్నికల్లో నేతన్నల ఓట్ల కోసం దీక్ష చేస్తానని ప్రకటించారే తప్ప, నేతన్నలపై ప్రేమతో కాదని వారు తెలిపారు. ఈ సమావేశంలో జెఏసి సభ్యులు మండల సత్యం వెల్లండి దేవదాస్ తాటిపాముల దామోదర్ కట్టెకోల లక్ష్మీనారా యణ , కోడం రమణ సిరిసిల్ల రవి , పిస్కమధు , యేల్దండి శంకర్ , గోనె పర్షరాములు , సిరిమల్ల సత్యం , నక్క దేవదాస్ గుండు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గాది పర్వదిన వేడుకలు

**సూర్య సిరిసిల్ల టౌన్**



తెలుగు సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలను అన్ని రాజకీయ పార్టీలు ఆయా పార్టీ కేంద్రాలలో ఘనంగా నిర్వహించారు.పంచాంగ శ్రవణాన్ని శ్రద్ధగా విని పచ్చడిని సేవించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రధాన పార్టీలు ఉగాది పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత రాష్ట్ర సమితి తెలంగాణ భవనంలో పట్టణ అధ్యక్షుడు చిందం చక్రపాణి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పచ్చడిని సేవించారు. ఈ కార్యక్రమంలో మేన రవి గుల్లపల్లి పూర్ణచందర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు ఉగాది వేడుకను కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరిపారు. వేదమూర్తులైన బ్రాహ్మణ సమక్షంలో ఉగాది వేడుకలు అంగరంగ వైభవంగా జరిపారు. స్వయంగా ఉగాది పచ్చడిని తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి పచ్చడి పంపిణీ చేశారు. అనంతరం బ్రాహ్మణులు పంచాంగ శ్రవణాన్ని వినిపించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, సీనియర్ నాయకులు నాగుల సత్యనారాయణ గౌడ్, సంగీతం శ్రీనివాస్,గడ్డం నరసయ్య,కత్తెర దేవదాస్, మ్యాన ప్రసాద్,వేముల రవి,రెడ్డి నాయక్,సామల దాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉగాది వేడుకలు

**సూర్య రుద్రంగి**



క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని రుద్రంగి మండల కేంద్రంతో పాటు మానాల గ్రామంలో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ స్వామి, ఆంజనేయస్వామి, మార్కండేయ ఆలయాలల్లో అర్చకులు ఉదయం నుండే ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. సాయంత్రం ఆంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్చకులు హరీష్ పంతులు పంచాంగ శ్రవణం చదివి గ్రామస్తులకు వినిపించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ గట్ల మీనయ్య మాట్లాడుతూ షడ్రుచుల ఉగాది ప్రతి ఇంటా ఆనందాలు పండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, ఈ కొత్త సంవత్సరంలో వర్షాలు బాగా కురుసి, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. మానాల గ్రామంలోని శంబులింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పంచాంగ శ్రవణం చదివి గ్రామస్తులకు వినిపించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గట్ల మీనయ్య, నాయకులు కొమురె శంకర్, తర్రె మనోహర్, మంచె రాజేశం, బైరి గంగమల్లయ్య, మాడిశెట్టి అభిలాష్, చెప్యాల గణేష్, గండి నారాయణ, మాడిశెట్టి ఆనందం, చెలుకల తిరుపతి, కర్ణవత్తుల దేవేంధర్,తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది పర్వదినాన భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

**సూర్య సిరిసిల్ల టౌన్**



షడ్రుచుల మేళ విప్పు ఉగాది పర్వదినాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఆనంద ఉత్సవాల మధ్య ఘనంగా జరుపుకున్నారు.పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.వసంత రుతువులు వచ్చే మొదటి పండుగ ఉగాది పండుగ ఈ ఉగాది పండుగను శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినముగా పిలుస్తాము. సిరిసిల్ల పట్టణంలో ఉగాది వేడుకలు అంబరాన్ని అంటాయి.సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో నేటి ఉదయం నుంచే మార్కెట్ కొనుగోళ్లతో కిటకిటలాడింది. పండుగకు కావలసిన సామాగ్రి కొనుగోళ్లతో ప్రజలు బిజీ అయ్యారు.షడ్రుచుల పచ్చడిని తయారు చేసేందుకు కావలసిన కొత్త కుండలు,బెల్లం,కారం, చింతపండు,వేప పువ్వు,ఉప్పు, ఇస్తారాకులు మామిడి ఆకులు వీటితోపాటు పిండివంటలకు కావాల్సిన వస్తువులతో మార్కెట్ కిటకిటలాడింది. కుటుంబ సభ్యులంతా ఒక్కచోట చేరి ఉగాది పచ్చడిని తయారుచేసి అందరూ పచ్చడి తీసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. మరోవైపు శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నేటి ఉదయం నుంచి భక్తులు దేవాలయాలకు తరలివచ్చారు. కుటుంబ సమేతంగా పట్టణంలోని శివనగర్ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం, వెంకటేశ్వర దేవాలయం,శ్రీ విశ్వనాథుల దేవాలయంలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబ సభ్యులను చల్లగా చూడాలని ఆ భగవంతున్ని వేడుకున్నారు.

## శంభులింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ఎన్నిక

**సూర్య రుద్రంగి**



రుద్రంగి మండలం మానాల గ్రామంలోని శంభులింగేశ్వర స్వామి ఆలయ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గా కొండ రాజేంధరగుప్తా, వైస్ చైర్మన్ వైస్ ఎంపీపీ పీసరి భూమయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురాతన ఆలయాన్ని గ్రామస్తుల సహకారంతో కోటి రూపాయలతో ఆలయ నిర్మాణం చేసుకోవడం జరిగిందన్నారు. గ్రామస్తుల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ గోపిడి రవీంధర్, మాజీ వైస్ ఎంపీపీ బాధనవేణి రాజారాం, నాయకులు గంగారెడ్డి, తూం జలపతి, జక్కు మోహన్, నాయిని రాజేశం, జక్కుల లక్ష్మీనర్సయ్య, జక్కు వంశీలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు.

**సూర్య రాజన్న సిరిసిల్ల**



పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని సిరిసిల్ల పట్టణంలోని ముస్లిం సోదరులకు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. మంగళవారం పట్టణంలోని జామా మసీదులో ప్రార్థనల అనంతరం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చొప్పదండి ప్రకాష్ మాట్లాడుతూ శాంతికి, సౌభ్రాతృత్వానికి రంజాన్ మాసం ప్రతీక అన్నారు. అత్యంత నియమనిష్టలతో రంజాన్ ఉపవాస దీక్షలు చేపడుతున్న ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వైద్య శివప్రసాద్, గడ్డం నరసయ్య, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి కాజా,మ్యాన ప్రసాద్, జామా మసీద్ సదర్ ఎండి సలీం, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆకునూరి బాలరాజు, పట్టణ ఉపాధ్యక్షులు అడ్డగట్ల శంకర్,మున్సిపల్ కౌన్సిలర్లు వేముల రవి,కుడికియాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం

**సూర్య సిరిసిల్ల టౌన్**



ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగ పరిరక్షణ కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అందుకే కాంగ్రెస్ పార్టీలో తాము చేరుతున్నట్లు ప్రముఖ న్యాయవాది పిట్టల భూమేష్ ముదిరాజ్ తెలిపారు.ఇటీవల బహుజన సమాజ్ పార్టీకి రాజీనామా ప్రకటించిన రాష్ట్ర మాజీ కార్యదర్శి ప్రముఖ న్యాయవాది పిట్టల భూమేష్ ముదిరాజ్ సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. సందర్భంగావారు మాట్లాడుతూ స్నేహితులు, అభిమానులు, శ్రేయాభి లాషుల అభీష్టం మేరకు తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విఫ్ ఆది శ్రీనివాస్,సిరిసిల్ల అసెంబ్లీ కాంగ్రేసు పార్టీ ఇంచార్జ కెకె మహేందర్ రెడ్డి సహకారంతో త్వరలోనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో తన అనుచరులతో కలసి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు.భారతీయ జనతా పార్టీ మోడీ సర్కార్ భారత రాజ్యాన్ని మార్చి మానవ హక్కులు హరిస్తున్నారని ఈక్రమంలో మానవహక్కుల పరిరక్షణ జరగాలని ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి మధూకర్, బొజ్జ నరేష్, సామల వెంకన్న పాల్గొన్నారు.

## బండి సంజయ్ నేత దీక్ష వాయిదా

**సూర్య సిరిసిల్ల టౌన్**



బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ సిరిసిల్లలో నేడు జరపతలపెట్టిన నేతన్నకు అండగా భరోసా దీక్ష కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు పట్టణ అధ్యక్షులు నాగుల శ్రీనివాస్ తెలిపారు. నేతన్నల ప్రధాన సమస్య బతుకమ్మ చీరెల బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించడంతోపాటు సంక్షోభంలో ఉన్న వస్త్ర పరిశ్రమను ఆదుకునేందుకు కొత్త ఆర్డర్లు ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో దీక్షను వాయిదా వేసినట్లు తెలిపారు.వీటితోపాటు నేతన్నల ఇతర డిమాండ్లను సైతం అమలు చేయాల్సిన బాధ్యత ప్రభు త్వంపైన ఉందని, నేతన్నలకు, ఆసాములకు మద్దతుగా బండి సంజయ్ వివిధ రూపాల్లో చేసిన పోరాటాలతోపాటు నేతన్నల ఐక్య పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చిందని అన్నారు.ప్రజల సమస్యలను పరిష్కరించ కుండా పాలకులు నిర్లక్ష్యం చేస్తే పోరాటాల ద్వారానే వాటికి పరిష్కార మార్గా లు సాధ్యమనే విషయం నేతన్న పోరాటాలతో మరోమారు రుజువైందని,ఈ విషయంలో వస్త్ర పరిశ్రమ అసాములకు, నేత కార్మికులకు భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ పక్షాన ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామని అన్నారు.భవిష్యత్తులోనూ నేతన్నలకు బీజేపీ వెన్నుదన్నుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం నేతన్నలకు ఇచ్చిన హామీలన్నీ ఎన్నికల కోడ్ ముగిసేలోపే అమలు చేయాలని అన్నారు. 6 గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన విధంగా ఎన్నికల్లో పబ్బం గడుపుకునేందుకు దొంగ హామీలిచ్చి నేతన్నలను మోసం చేయాలనుకుంటే మాత్రం చూస్తూ ఊరుకునేది లేదని,నేతన్నలకు అండగా పోరాటాన్ని ఉధృతం చేసి రాష్ట్ర ప్రభుత్వ మెడలు వంచేందుకు వెనుకాడబోమని అన్నారు. ఈ విషయంలో బండి సంజయ్ నేతన్నలకు నిరంతరం వెన్నుదనక్నుగా ఉంటూ అవసరమైతే మరోమారు దీక్ష చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శిలు కైలాష్,కొండ నరేష్, ఏనుగంటి నరేష్, పట్టణ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాహనాల ప్రమాదాలు జరిగిన కానీ అధికారులు పట్టించుకోరా ?

- వాహనాల ప్రమాదాలు జరిగిన కానీ అధికారులు పట్టించుకోరా ?

- అధికారుల నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణమ ?

**సూర్య శంకరపట్నం**

మండల కార్యాలయాలకు వెళ్లే రహదారిపై కొంతమంది వాహనదారులు ప్రమాదాలు జరిగిన కూడా అధికారులు పట్టించుకోవడం లేదంటున్న వాహనదారులు. వివరాల్లోకి వెళితే శంకరపట్నం మండలం పరిధిలోని అంబాల్ పూర్, ఇప్పలపల్లి, గ్రామం నుంచి విద్యార్థులు, సైకిళ్లపై, వాహనదారులు వాహనాలపై మండల కార్యాలయాలైన తాసిల్దార్ కార్యాలయం తెలంగాణ మోడల్ స్కూల్, కస్తూర్బా బాలికల పాఠశాల, మండల వైద్య ప్రాథమిక కేంద్రం, మండల పరిషత్, వ్యవసాయ శాఖ, విద్యాశాఖ, కార్యాలయాలకు వాహనాల పై వచ్చే వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందంటున్న వాహనదారు. రోడ్డుకు ఇరువైపులా మూల మలుపుల వద్ద ముళ్లపోదలు రోడ్డుకు అడ్డంగా ఉండడం వలన వాహనానికి ఎదురుగా వచ్చే వాహనాలు కనబడటం లేదని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని. మండల కేంద్రంలోని పాఠశాలలకు విద్యార్థులు సైకిళ్లపై వెళ్లడానికి కూడా భయపడుకుంటూ పాఠశాలకు వెళు తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ,వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే గత ఎనిమిది నెలలుగా ఈ ముళ్ళ పొదలు ఇలానే పెరిగిపోయి రోడ్డుకు అడ్డంగా వస్తు



వాహనదారుల ప్రమాదాలకు దారితీస్తున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే ఈ ముళ్ళ పొదలను తొలగించాలని ప్రజలు వాహనదారులు కోరారు.

# కరీంనగర్ డిసిసి కార్యాలయంలో పంచాంగ శ్రవణం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నేడు కరీంనగర్ డిసిసి కార్యాలయంలో పంచాంగ శ్రవణం ఏర్పాటు చేయడం జరిగింది.మొదట పురోహితులు సాంబశివ శర్మ గారు భగవంతుని పూజా కార్యక్రమం నిర్వహించి అనంతరం కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమక్షంలో పంచాంగం చదివి వినిపించినారు. అనంతరం జిల్లా ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు తెలుగు నూతన సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పురుమల్ల శ్రీనివాస్, పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్ నాయకులు మడుపు మోహన్, మునిగంటి అనిల్, ఆకారపు భాస్కర్ రెడ్డి, మల్లికార్జున రాజేందర్, సిరాజ్ హుస్సేన్, పొన్నం మధు,బాల బద్రి శంకర్, పడిశెట్టి భూమయ్య, రోళ్ళ సతీష్, సిరిపురం నాగప్రసాద్, విక్టర్, కుంభాల రాజ్ కుమార్,




కుర్ర పోచయ్య, నూనె గోపాల్ రెడ్డి, పెంచాల లక్ష్మణరావు, వీర దేవేందర్, బొమ్మ ఈశ్వర్ గౌడ్, గాలిపెల్లి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయంలో ఉగాది పండుగ వేడుకలు

**సూర్య వేములవాడ టౌన్**

తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఉగాది ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ సీతారామచంద్రస్వామి వారికి పంచోపనిషత్ ద్వారా అభిషేకం అర్చకులు వేదమంతాలతో నిర్వహించారు. సాయంత్రం ఓపెన్ స్లాబ్ వేదిక వద్ద పంచాంగ శ్రవణాన్ని ఆలయ అర్చకులు చంద్రగిరి శరత్ శర్మ నిర్వహించారు. అలాగే శ్రీరామనవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు జరుగుతాయి. రాత్రి పట్టణ పురవీధుల గుండా పెద్ద సేవ ఊరేగింపు జరుగుతుంది. ఈనెల 17న శ్రీరామ నవమి వేడుకలు, సీతారామ కళ్యాణం జరుగుతుంది.



# ఎండిపోయిన చెట్లతో పొంచి ఉన్న ప్రమాదం?

**సూర్య శంకరపట్నం**

వరంగల్ నుంచి కరీంనగర్ వెళ్లే ప్రధాన రహదారిపై రోడ్డుకు ఇరువైపులా ఎండిపోయిన చెట్లు ప్రమాదకరంగా మారాయన్న వాహనదారులు. శంకరపట్నం మండలం లోని కొత్తగట్టు గ్రామం నుంచి తాడికల్ శివారు వరకు రోడ్డుకు ఇరువైపులా దాదాపు 50, 60, వరకు పెద్ద పెద్ద ఎండిపోయిన వృక్షాలు ప్రమాదపరితంగా కనపడుతున్నాయని.భారీగా గాలి వీస్తే చెట్టు ఏ క్షణంలోనైనా కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. ప్రధాన రహదారిపై ఉన్న ఈ వృక్షాన్ని ఆర్అండ్ బి అధికారులు తక్షణమే స్పందించి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, రైతులు, రహదారి వెంట ప్రయాణించే ప్రయాణకులు, వాహనదారులు కోరుతున్నారు.



# ఘనంగా ఉగాది పండుగ వేడుకలు

**సూర్య, హుజురాబాద్**

హుజురాబాద్ పట్టణంలోని హనుమాన్ దేవాలయం, అయ్యప్ప దేవాలయం, పాటి మీద అంజనేయ స్వామి దేవాలయం, శివాలయం, రామాలయం, కేసి క్యాంపు లోని వెంకటేశ్వర ఆలయంలో పండుగను పురస్కరించుకొని భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆయా దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.



**పంచాంగ శ్రవణం...**

క్రోధి నామ సంవత్సరం మొదటి రోజు ఉగాది పండుగను పురస్కరించుకొని హుజురాబాద్ పట్టణంలోని రామాలయంలో వేద పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ ఏడాది రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో ప్రజల ఆదాయ, వ్యయ, వ్యక్తి రాజ పూజితం, అవమానాలు మొదలైన అంశాలపై వేద పండితులు భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ రాధిక, కౌన్సిలర్లు, పుర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



# పంచాంగ శ్రవణం కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ పట్టణంలోని మార్కెట్ రోడ్డు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నేటి శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బ్రహ్మశ్రీ గోవిందవరం కళ్యాణ శర్మచే నిర్వహించబడిన పంచాంగ శ్రవణం కార్యక్రమానికి రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు అయ్యారు. వారితో పాటు మాజీ కార్పొరేటర్ వైద్యుల శ్రీదేవి అంజన్ కుమార్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఆలయ ఈవో ఉడుతల వెంకన్న, కాంగ్రెస్ నేతలు మల్యాల సుజిత్ కుమార్, సాయిని రవి, పడాల రాహుల్, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, నాగ ప్రసాద్, ఆకారపు భాస్కర్ రెడ్డి, దొంతి గోపి, పోరాండ్ల రమేష్, లింగంపల్లి బాబు, ఎలగందుల మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు

**సూర్య తిమ్మాపూర్**

మానకొండూర్ శాసనసభ్యులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలకు నియోజకవర్గంలోనీ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. వేద పండితులచే ఉగాది వేడుకలు,పంచాంగం శ్రావణ కార్యక్రమం నిర్వహించారు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలకు శుభం కలగాలని వానలు సమృద్ధిగా కురిసి రైతుల కుటుంబాలు ఆనందంగా ఉండాలని మానకొండూర్ నియోజకవర్గం, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని కోరారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా ఉగాది పండుగ వేడుకలు ప్రజలందరితో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.




విలేకరులు కావలెను

జిల్లా వ్యాప్తంగా ఈ క్రింది ఏరియా వారీగా విలేఖరులు కావలెను

కరీంనగర్

◆ కరీంనగర్‌టౌన్ ◆ కొత్తపల్లి ◆ గంగాధర

◆ రామడుగు ◆ సైదాపూర్

సిరిసిల్ల

◆ వేములవాడ రూరల్ ◆ వేములవాడ అర్బన్

◆ వీర్లపల్లి ◆ గంభీరావుపేట

అర్హతలు: 1. జర్నలిజంపై ఆసక్తి,
2. సమకాలిన పరిస్థితులపై అవగాహన, 3. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత

సూర్య

ఆసక్తి గలవారు సంప్రదించగలరు
కరీంనగర్ యూనిట్
సెల్: 94929 83400

# డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదు

**- మైనర్ పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వకండి - 'ఖని' వన్ టౌన్ సీఐ ఏ.ఇంద్రసేనారెడ్డి**



**సూర్య-గోదావరిఖని:** డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఎవరు కూడా వాహనాలు నడపకూడదని, వేసవి సెలవుల కారణంగా ముఖ్యంగా విద్యార్థులు రోడ్లపై వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికా వద్దని స్థానిక వన్ టౌన్ సీఐ ఏ.ఇంద్రసేనారెడ్డి కోరారు. పట్టణ ప్రజలు, యువత, విద్యార్థులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విషయాలను తెలుసుకొని పోలీసు వారి సూచనలు తప్పకుండా పాటించాలని సూచించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు, యువత సరదా కోసం తల్లిదండ్రులకు సంబంధించిన బైక్, కారు తీసుకొని ఎలాంటి డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా రోడ్లపైకి రావడం చట్టరీత్యా నేరం అనే విషయాన్ని సీఐ గుర్తు చేశారు. మైనర్ పిల్లలు వాహనాలను నడపడం, హెల్మెట్ లేకుండా రాష్ డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్ లో వెళ్తూ ప్రమాదాలకు గురికా వడం ఇటీవల తరచు జరుగుతున్నాయని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ప్రమాదాలకు గురికావడం, సెల్ఫోన్ లో మాట్లాడుతూ డ్రైవ్ చేస్తూ ప్రమాదాలకు గురై వారి తల్లిదండ్రులకు తీవ్ర దుఃఖాన్ని మిగులుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి ప్రమాదాలకు సంబంధించి కొన్ని రోజులుగా తరచూ తమ వద్ద కేసులు నమోదు కావడం జరుగుతుందని, ఇటీవల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో 9 కేసులు నమోదు కావడం జరిగిందని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ తరపున రాబోయే 15 రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించిన వారి పై చట్ట పరిధిలో కఠిన చర్యలు తీసుకో వడం జరుగు తుందని సీఐ ఇంద్రసే నారెడ్డి హెచ్చరిం చారు. మైనర్ పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో వారి తల్లిదం డ్రులు వాహనాలు ఇవ్వకూడదని, వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనం నడపకూడదని, ర్యాష్ డ్రైవింగ్ చేస్తే ఊరుకునేది లేదని, వాహనాలకు సంబంధించిన పూర్తి అనుమతి పత్రాలు ఉండాలని తెలిపారు. తాము సూచించే నిబంధనలు పాటిస్తూ ఎలాంటి ప్రమాదాలకు గురి కాకుండా కుటుంబ సభ్యులకు తోడుగా ఉండాలని, ప్రమాదాలు చేసి ఇతరులను, వారి కుటుంబ సభ్యులను రోడ్డుపాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఏదైనా ప్రమాదానికి గురై పోలీసు కేసుల్లో ఇరుక్కుంటే ఉద్యోగ సమయంలో యువత ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

## నూతన సంవత్సరం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలి

**-ఓసీపీ-1 ప్రాజెక్ట్ ఆఫీసర్ నలజాల రాధాకృష్ణ**

**సూర్య, సెంటినరీ కాలనీ**



నూతన సంవత్సరం నిర్దేశించిన లక్ష్యాన్ని అదిగమించాలని ఓసీపీ-1 ప్రాజెక్ట్ ఆఫీసర్ నలజాల రాధాకృష్ణ అన్నారు. క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆర్జీ-3 డివిజన్ ఓసీపీ-1 ప్రాజెక్ట్ లోని బేస్ వర్క్ షాప్ లోని అమ్మవారి ఆలయం లో ప్రాజెక్ట్ ఆఫీసర్ నలజాల రాధాకృష్ణ పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించిన తర్వాత ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. 2023-24 వ సంవత్సరానికి ఎలాగైతే అధిక ఉత్పత్తి సాధించినామో అదే స్ఫూర్తి తోటి 2024-25 వ సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని అదిగమించి రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని కోరారు. గత సంవత్సరం అమ్మవారి కృప తో మీ అందరి సమిష్టి కృషి తో రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రాజెక్ట్ ఇంజనీర్ ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఉదయ్ హరిజన్, రక్షణ అధికారి కోటయ్య, యాక్టింగ్ హెచ్ఓడి ఐ.శ్రీనివాస్, జెఈలు రఘు కుమార్, రవీందర్, సూపర్వైజర్ లు, కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

## వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు, పిల్లలకు దుస్తుల పంపిణీ

**- ఉగాది అందరి జీవితాల్లో నవ వసంతాలు నింపాలి**

**- వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మురికి పూర్ణిమా**

**సూర్య, జమ్మికుంట రూరల్**

జమ్మికుంట మండలంలోని శాయంపేట గ్రామంలో వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో పేద మహిళలకు, పిల్లలకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. జమ్మికుంట వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మురికి పూర్ణిమ ఆధ్వర్యంలో ఈ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలకు, పిల్లలకు నూతన చీరలు, డ్రస్సులతో పాటు ఉగాది పచ్చడిని వారికి అందించారు. ఈ సందర్భంగా వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మురికి పూర్ణిమ మాట్లాడుతూ వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రకాల సేవలను అందించడం జరుగుతుందని, అందులో భాగంగానే ఈ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కొంతమంది మహిళలకు, పిల్లలకు నూతన వస్త్రాలను మా క్లబ్ సహాయంతో అందించడం జరిగిందని ఆమె అన్నారు. వారికి బట్టలతో పాటు ఉగాది పచ్చడిని అందించి వారికి ఉగాది శుభాకాంక్షలు తెలపడం జరిగిందని ఆమె తెలిపారు. రాబోయే రోజుల్లో వాసవి వనిత క్లబ్ ద్వారా మరిన్ని సేవలు అందిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ కార్యదర్శి భాగ్యలక్ష్మి, రీజనల్ చైర్మన్ గంప సురేందర్, ప్రముఖ వ్యాపారి మురికి అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



## పోచమ్మ ఆశీర్వాదంతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

**-ౕకాల్వ శ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్.**



**సూర్య కాల్వ శ్రీరాంపూర్** పోచమ్మ తల్లి ఆశీర్వాదంతో మండల ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కాల్వ శ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఉగాది వేడుకల్లో భాగంగా కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో కాలనీవాసులు పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై బోనమెత్తిన మాజీ గోపగోని సారయ్య గౌడ్ , వైస్ ఎంపీపీ జూ కమిటీ శిరీష అనిల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి మునీర్ లు మాట్లాడుతూ కాలనీవాసులంతా ప్రతి ఏటా ఉగాది వేడుకలను పురస్కరించుకొని పోచమ్మ బోనాల నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని డప్పు చప్పులతో శివశక్తుల పూనకాలతో పోచమ్మ తల్లి వద్దకు వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తమ పిల్లాపాపలు చల్లంగా ఉండాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలని నైవేద్యం మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్,వైస్ ఎంపీపీ జూకంటి శిరీష అనిల్,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి మునీర్, మండల పార్టీ అధ్యక్షుడు గాజన వేన సదయ్య, మాజీ సర్పంచ్ మాదాసి సతీష్, మాజీ ఎంపీటీసీ పొట్యాల మొండయ్య, జిల్లా నాయకులు మేడి అశోక్ గౌడ్, శివరామకృష్ణ, రానవేన క్రాంతి,కొంతం మదు, సబ్బని రాజమల్లు, ఆశాడపు సురేష్, పాలరాజేశం, తాండ్ర కృష్ణ, తాండ్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిరుపేదల మహిళలతో ఉగాది సంబరాలు



**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

తెలుగు నూతన సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూలీ పని చేసుకునే, చిరు వ్యాపారాలు చేసుకునే గుడిసెల ప్రాంతాల్లో నివసించే మహిళలతో చిన్నారులతో ఉగాది సంబరాలు చేసుకోవడం జరిగింది. ఉగాది పండగ ఇంట్లో చేసుకున్నాట్టుగా మాదిరిగానే పచ్చడి తయారు చేసి అందరికీ పులిహోర భక్షాలు మహిళలకు చీరలు పిల్లలకు డ్రెస్సులు, టవల్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ విధంగా మేము సైతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి పండగ ను అనాధలతో నిరుపేదలతో చేసుకోవడం మా సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశ%శీ% ఎందుకంటే అందరి కళ్ళల్లో ఆనందం చూడాలని ఉద్దేశం అందరికీ చీరలు టవల్సు, భక్షాలు, పచ్చడ వితరణ చేయగానే అందరి కళ్ళల్లో ఆనందం కనిపించలని వాళ్లు కూడా చాలా సంతోషంగా అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని సంతొషం వ్యక్తం చేశారు. ఈ ఉగాదిని అందరికీ ఆయురారోగ్యాలతో ఉండాలని అందరూ అనుకున్నవన్నీ జరగాలని ఫౌండేషన్ అధ్యక్షురాలు స్వప్న అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న శ్రీనివాస్, రూప, అనురూప్, తదితరులు పాల్గొనడం జరిగింది.



## ఘనంగా 54వ ఎన్ఎస్ యుఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి మండలం సెంటినరీ కాలనీ లోని శ్రీపాద భవన్లో, ఐఎన్టీయూసీ కార్యాలయంలో ఘనంగా 54వ ఎన్ఎస్ యుఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-3 ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, సెంటినరీ కాలనీ పట్టణ అధ్యక్షులు కాటం సత్యం, ఎంపీటీసీ గణపతి, ఎన్ఎస్ యుఐ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు ఈగ ప్రశాంత్ మరియు ఎన్ఎస్ యుఐ నాయకులు బండారి శివ, కండే సాయి సంజయ్ వర్మ, రామ్కుమార్, ఎలిగేటి శివకుమార్, వికాస్ రెడ్డి, విశాల్, సనత్, సుమతి, సూర్యప్రకాశ్, పాల్గొన్నారు.

## శివాలయంలో ప్రత్యేక పూజలు

**సూర్య-పెద్దపల్లి రూరల్**



మండలం లోని పెద్ద బొంకూర్ గ్రామంలో శ్రీ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ క్రోధి నామ ఉగాది పండగ సందర్భంగా శివాలయంలో రుద్రాభిషేకం నిర్వహిస్తూ, గోమాతకు పూజలు చేసి ఉగాది షడ్రుచుల పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. ఈ క్రోధి నామ ఉగాది పండగ నూతన సంవత్సరం లో పాడి పంటలు సమృద్ధి గా పండాలని సిరిసంపదలతో ఆనందమయ జీవితానికి నాంది పలకాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ మిట్టపల్లి శ్రీనివాస్ , సీపెల్లి శ్రీనివాస్ చారి , గంటి నందం,నిమ్మల నరేష్, పిల్లలమర్రి అశోక్, మడుపు కృష్ణమాచారి, కలవేన సంపత్, గైని దివిన్ , కొత్తూరి సదానందం, కడారి రాయలింగు, కలవేన బద్రి, కలవేన సంజీవ్, సేపెల్లి విరాట్ సాయి, బాలు, కల్వల తిరుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

## తెలుగు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పూజలు

**సూర్య, సెంటినరీ కాలనీ**



కమాన్పూర్ మండలంలోని ప్రజలు నేటి నుంచి ప్రారంభమైన క్రొధి నామ ఉగాది సంవత్సరానికి స్వాగతం పలుకుతూ.. కుటుంబ సమేతంగా ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంట్లో ఉగాది పచ్చడి తాగి , బూరెలు చేసుకుని కుటుంబ సమేతంగా కలిసి భుజించారు. కొత్త సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని, కరువు కాటకాలు లేకుండా చూడాలని ఆ భగవంతుణ్ణి ప్రజలు వేడుకున్నారు. స్థానిక ఆదివరాహస్వామి దేవాలయంలో భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. కళ్యాణ మండపంలో సముద్రాల వేణుగోపాల చార్యులు, రామానుజం లు పంచాంగం శ్రావణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయా ల ఆవరణలో వాహన పూజలు నిర్వహించారు. పలువురు దాతలు పులిహోర ప్రసాదం, తాగునీటి సౌకర్యం కల్పించారు. భక్తులకు స్వామి వారి దర్శనం లో ఇబ్బందులు కలగకుండా సాధారణ, ప్రత్యేక దర్శనం క్యూ లైన్ లను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సుజాత, ఈఓ కోసన కాంతారెడ్డి చర్యలు తీసుకున్నారు. ఆది వరాహ స్వామి ఆలయానికి వచ్చే రహదారి లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, క్యూ లైన్ లో భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గోదావరిఖని టూ టౌన్ సీఐ రవీందర్, ఎస్ఐ మామిడాల చంద్రశేఖర్ ల ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

## రథోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**సూర్య మెట్పల్లి**



ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో నిర్వహించే రథోత్సవం కార్యక్రమంలో కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సరోజమ్మ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రణ వేణి సుజాత సత్యనారాయణ, ఎంపీపీ మారు సాయి రెడ్డి తదితరులు ఉన్నారు.

# పూలే జయంతిని ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలి

## - బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

బీసీల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే 198వ జయంతి ఉత్సవాలను జిల్లావ్యాప్తంగా బీసీ కుల సంఘాలతో కలిసి ఘనంగా నిర్వహిస్తామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ పాత్రికేయ సమావేశంలో పేర్కొన్నారు. మంగళవారం భాగ్యనగర్ లోని బిసి సంక్షేమ సంఘ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రతి ఏటా పూలే ఉత్సవాలను ప్రభుత్వమే నిర్వహించేదని, పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రభుత్వ పెద్దలు కాకుండా ఈసారి అధికారులు మాత్రమే నిర్వహిస్తున్నారని అన్నారు. 136 బీసీ కులాలు, ఎస్సీ ,ఎస్టీ ,మైనార్టీ అగ్రకులాలను కలుపుకొని పెద్ద ఎత్తున నిర్వహిస్తామని అన్నారు. దేశంలో 70 కోట్ల బీసీల ఐకాన్ పూలే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు ఎకరాల్లో పూలే స్మృతి వైనం ఏర్పాటు చేసి 200 అడుగుల పూలే విగ్రహం ఏర్పాటు చేస్తేనే బీసీలను గౌరవించినట్లని అన్నారు. గత 10 ఏళ్ల కాలంలో టిఆర్ఎస్ ప్రభుత్వం పూలే జయంతిని నామమాత్రంగా నిర్వహించాలని, కనీసం విగ్రహం ఏర్పాటు చేయలేదని, మాజీ సీఎం కేసీఆర్ ఎన్నడూ పూలే చిత్రపటానికి పూలదండ కూడా వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల జయంతి చేయాలంటే భవనం లేదని , ముకరంపుర లోని జ్యోతిబాపూలే మైదానంలో జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలు ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు పత్రిక ద్వారా, అప్పటి మంత్రి గంగుల కమలాకర్ కి జిల్లా కలెక్టర్ కి ఎన్నోసార్లు వినతి పత్రం సమర్పించడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి బిసి భవనం, జ్యోతిబాపూలే మైదానంలో విగ్రహాల ఏర్పాటు చేయాలని పత్రిక ద్వారా విన్నవించు కుంటున్నామని తెలిపారు .మహనీయులకు నగరంలో విగ్రహాలు జిల్లాలకు పేర్లు, ఫ్లై ఓవర్లకు పేర్లు పెట్టాలని, ప్రస్తుతం నిర్మిస్తున్న కలెక్టరేట్ కు పూలే పేరు పెట్టి విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం లోకి రాగానే ప్రగతిభవనకు పూలే పేరును పెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పూలే జయంతి ఉత్సవాలలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బీసీ కుల సంఘాలకు పిలుపునిచ్చారు.



# విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

**సూర్య జగిత్యాల టౌన్**



జగిత్యాల పట్టణంలో విశ్వహిందూ పరిషత్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చడి, బూరెలు వితరణ చేశారు. అనంతరం నీలగిరి వికాస్ రావు ఉగాది విశిష్టతను వివరించారు. ప్రకృతిలో మార్పులతో వచ్చే ఉగాది నూతన సంవత్సర ఆరంభం అవుతుందని, శిశిర రుతువు పోయి వసంత రుతువులోకి అడుగు పెడుతుందని, ఉగాది అన్ని శుభకార్యాలకు ప్రారంభము అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏ సి ఎస్ రాజు, కాశీ నాదం, ప్రసాద్ రావు, పట్టణ అధ్యక్షుడు జిట్టవేణి అరుణ్ కుమార్, జిల్లా సహా కార్యదర్శి సంతోష్, జిల్లా కోశాధికారి రాములు, బిట్టు, మైలారపు పవన్, మైలరపు భార్గవ్, సాయి ప్రసాద్, పరందం, పట్టణ కౌన్సిలర్ లు గుర్రం రాము, పృథ్వి, రాజు కుమార్, ప్రశాంత్, రామ్ మోహన్ రావు, వేముల సంతోష్, పదం మహేందర్, ప్రణీత్ , కొండాపూర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అధిక ధరకు విక్రయించేందుకు, అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ రేషన్ బియ్యం పట్టివేత

## - ముగ్గురిపై కేసు నమోదు చేసిన కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ ఏ. ప్రదీప్ కుమార్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ గోపాల్ పూర్ రేషన్ డీలర్ అయిన బెజ్జంకి అంజయ్య ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయు రేషన్ బియ్యాన్ని అక్రమంగా అధిక ధరకు విక్రయించేందుకు, దుర్శేడ్ గ్రామానికి చెందిన శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లు యజమాని అయిన మొగసాల సంతోష్ రెడ్డి కి రైస్ మిల్లుకు తరలిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు కరీంనగర్ స్పెషల్ బ్రాంచ్, రూరల్ పోలీసులు సంయుక్తంగా సోమవారం అర్ధరాత్రి జరిపిన దాడిలో ట్రాలీ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 810 సంచుల బియ్యాన్ని దాదాపు 504 క్వింటాళ్లు పట్టుకున్నారు. తరలించేందుకు ఉపయోగించిన ట్రాలీ వాహనాన్ని సైతం సీజ్ చేసి ముగ్గురిపై రేషన్ డీలర్ అంజయ్య , వెంకటేశ్వర రైస్ మిల్లు యజమాని సంతోష్ రెడ్డి , ట్రాలీ డ్రైవర్ మధుల పై 420 ఐపీసీ , సెక్షన్ 07 ఆఫ్ EC యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ ఏ ప్రదీప్ కుమార్ తెలిపారు.



# జాతీయ భావాలు కలిగిన వ్యక్తి నిర్మాణమే ఆర్.ఎస్.ఎస్ ధ్యేయం.

## - ఉగాది ఉత్సవాలలో ఆర్.ఎస్.ఎస్ వక్తల ఉద్ఘాటన

**సూర్య, రాయికల్**

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ హిందూ ధర్మ రక్షణే లక్ష్యంగా,నిత్యశాఖల ద్వారా జాతీయ భావాలు కలిగిన ఉన్నతమైన వ్యక్తుల నిర్మాణమే ధ్యేయంగా పని చేస్తుందని ఆర్.ఎస్.ఎస్ వక్తలు ఉద్ఘాటించారు.శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది ఉత్సవము ల సందర్భంగా మహితాపూర్ లో కరీనగర్ విభాగ్ సంఘచాలక్ లు డాక్టర్ బీమనాతి శంకర్,రామాజీపేట్ లో జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ కొంగరి సాయికృష్ణ,రాయికల్ లో గొల్లపెల్లి ఖండ కార్య వాహ్ శ్రీహరి,ఆలూర్ లో ఖండ సామాజిక సమరసత ప్రముఖ్ ఎద్దండి రాజు,కుమ్మరిపల్లిలో రాయికల్ ఖండ కార్య వాహ్ వేల్పుల స్వామి యాదవ్, భీమన్న గుడి వద్ద విస్తారకులు వల్లపురెడ్డి అక్షయ్ రెడ్డి,అమరగొండ భీరయ్య లు మాట్లాడుతూ హిందూ సమాజం కులాలకు, రాజకీయాలకు అతీతంగా సనాతన హిందూ ధర్మ రక్షణకై సంఘటితంగా ఉండాలనీ,హిందువుల స్వీయ రక్షణ,ధర్మ రక్షణ చేపట్టే వారికే రాజ్యాధికారం కట్టబెట్టాలని అన్నారు.370 ఆర్టికల్ రద్దు, అయోధ్యలో భవ్యమైన శ్రీ రామాలయ నిర్మాణం, ఆర్థికాభివృద్ధి లో ప్రపంచంలో 5,వ స్థానంలో దేశం నిలబడటం, ప్రపంచంలో దేశం యొక్క ప్రతిష్ట అగ్రస్థానంలో నిలబడటం మన దేశం సాధించిన విజయాలని అన్నారు.1925 విజయ దశమి రోజున ఆర్.ఎస్.ఎస్ ను పరమపూజనీయ డాక్టర్ కేశవ రావు బలిరాంపంత్ హెడ్గేవారు ఐదుగురు బాల స్వయం సేవకులతో ప్రారంభించారని, అది నేడు వటవృక్షమై, విశ్వవ్యాప్త అయినదని అన్నారు. దేశాన్ని సమర్థవ ంతంగా నడిపించే పాలకులను, ప్రపం చాన్ని వసుదైక కుటుంబం గా మార్చే మహోన్నత వ్యక్తులను తయా రు చేసి సమాజానికి అందిస్తుం దని అన్నారు. కొందరు దేశద్రోహులు ఈ దేశంలో ఉంటూ ఈ దేశంలో భోగభాగ్యాలు, ఉద్యోగాలు, సకల సుఖసంపదలు అనుభవిస్తూ ఈ దేశ విచ్ఛిన్నానికి, దేశ సార్వభౌమత్వానికి హాని కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని అటువంటి వారితో హిందూ సమాజం జాగరుకతతో ఉండాలని సూచించారు. నిత్య శాఖల ద్వారానే సమాజం సంఘటితమౌతుందని ప్రతీ ఒక్కరు వారి ఆరోగ్య రక్షణ, సర్వాంగీణ వికాసానికై, దేశ రక్షణకై రోజుకో గంట సమయం కేటాయించి నిత్య శాఖల కు వెళ్ళాలని, నడిపించాలని కోరారు. ప్రార్థన చేసి ఆరు రుచులతో కూడిన ఉగాది పచ్చడిని సేవించారు. మహితాపూర్ ఉత్సవములో పాల్గొన్న 120 మంది స్వయం సేవకులకు సనాతన ధర్మ సమితి యూత్ మహితాపూర్ సంగ రాజేందర్ యాదవ్, నాగుల గంగారాం యాదవ్, సంగ మహేష్ యాదవ్, నాగుల మహేష్ యాదవ్ కరీనగర్ విభాగ్ సంఘచాలక్ లు డాక్టర్ బీమనాతి శంకర్, ఖండ బౌద్ధిక్ ప్రముఖ్ దొంగ జితేందర్ రెడ్డి చేతుల మీదుగా భగవద్గీతలను ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ దేవాలయంలో భక్తుల సందడి



**సూర్య, హుజురాబాద్**

తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదినం రోజైన మంగళవారం హుజురాబాద్ పట్టణంలోని పోచమ్మ కాలనీలో ఉన్న పోచమ్మ దేవాలయంలో దర్శనానికి వచ్చిన భక్తులతో దేవాల యం సందడిగా మారింది. ఉగాది పండుగ పురస్కరించుకొని పట్టణంలోని పలువురు భక్తులు బోనాలను తీసుకొని పోచమ్మ దేవాలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులను అప్పచెప్పుకున్నారు. ఉగాది రోజున భక్తులు రాక అధికంగా ఉండడంతో పోచమ్మ దేవాలయ అభివృద్ధి కమిటీ భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లను చేసింది. ఉదయం నుండి సాయంత్రం వరకు భక్తులు తమ బోనాలను అప్పచెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, అపరాధ ముత్యం రాజు, ముక్క రమేష్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, గౌరవ అధ్యక్షులు కొలిపాక రమేష్, చైర్మన్ భూమి చందు, వైస్ చైర్మన్ నడిగొట్టు రమేష్, డైరెక్టర్లు సొల్లు మోహన్ రాజు, అపరాధ రాములు, తొర్రి అశోక్, పంజాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఇష్టదైవ స్మరణ తోనే ఇక్కట్లు తొలగిపోతాయి

## - ఉగాది పంచాంగ శ్రవణం లో పురోహితుల ప్రవచనం

**సూర్య, రాయికల్**



ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రాయికల్ పట్టణంతోపాటు వివిధ గ్రామాల్లోనీ ఆలయాలలో పురోహితులుచే పంచాంగ శ్రవణం నిర్వహించారు.ఈ సంవత్సరంలో మన భారతదేశం కొంత ఒడి దొడుకులు ఎదుర్కొన్న కూడా,ప్రపంచ దేశాలలో మంచి గుర్తింపు పొంది, ప్రగతి పథంలో ముందుకు వెళుతుందనీ,నల్లరేగడి భూములు ఫలవంతం అని,నలుపు ఎరుపు రంగు గల ధాన్యాలు ఎక్కువ గాపండుతాయని, మనదేశంలో కానవచ్చే సూర్య,చంద్ర గ్రహణాలు లేవని తెలిపారు. క్రోధి సంవత్సరంలో ప్రజలకు వచ్చే దోషాలు తొలగిపోవాలంటే ఆధ్యాత్మిక సేవలో తరించాలని, ఇష్టదైవ స్మరణం చేయాలని తెలిపారు. తద్వారా ఉపశమనం కలుగుతుందని అన్నారు.అనంతరం పచ్చడి వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో పురోహితులు చెరుకు రాజేశ్వర్ శర్మ, మహేశ్వం ˇశర్మ శర్మ, మునుగోటి సత్యనారాయణ శర్మ,సతీష్ శర్మ,మధు శర్మ, వివిధ గ్రామాల పురోహితులు,నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉగాది పండగ వేడుకలు



**సూర్య - కథలాపూర్**

మండలంలోని పలు గ్రామాల దేవాలయలలో మంగళవారం ఉగాది పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా భక్తులకు ఆలయ నిర్వాకులు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.అంతకుముందు ఆలయాల్లో పురోహితులు పంచాంగ శ్రవణంను భక్తులకు వినిపించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు,ఆలయ కమిటీ అధ్యక్షుల్లు, సభ్యులు, ప్రజలు తదితరులు ఉన్నారు.